మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD | తెలుగు దిన పత్రిక | RNI No: APTEL/2012/45237

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రంగారెడ్డి | శనివారం | 06-12-2025 | సంపుటి : 14 | సంచిక :180 | పేజీలు :8 | వెల : 3 రూ |
| RangaReddy | Saturday | 06-12-2025 | Volume :14 | Issue:180 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

## శాంతిపక్షానే భారత్..

### పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ: డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** శాంతిపక్షానే భారత్ నిలుస్తుందని, ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ తో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, దేశాల సంక్షేమం శాంతి మార్గంలోనే ఉందని, దౌత్యం ద్వారానే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాలను పరిష్కరించుకుంటారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. భారత్, రష్యా కలిసి ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దామని పుతిన్‌తో అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి పుతిన్ ప్రభుత్వం భారత్‌పై విశ్వాసం ఉంచి ప్రతి విషయాన్ని తమతో పంచుకుందని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలమని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెబుతూ వచ్చామని, ప్రపంచానికి కూడా తెలియజేశామని అన్నారు. ఇటీవల కాలంలో గ్లోబల్ నేతలతో తాను ఎప్పుడు మాట్లాడినా ఇండియా తటస్థం కాదనీ, ఇండియాకు స్పష్టమైన వైఖరి ఉందని, శాంతియుతంగా జరిగే ఏ పరిష్కారానికైనా తమ సపోర్ట్ ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పామని మోదీ తెలిపారు.

2లో

## కేసీఆర్ వరంగల్ జిల్లాను

# గాలికొదిలేశారు



రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల
రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ

**డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజ కవర్గంలో పర్యటించి, అభివృద్ధి పనులపై వరాల జల్లు కురిపించారు. ఈరోజు ఆయన రూ.532.24 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన పనులలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ, పలు రోడ్ల విస్తరణ పనులు ఉన్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఫాంహౌ స్‌లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు కానీ, ఉద్యమగడ్డ వరంగల్‌కు ఏమీ చేయలేదు. వారు ఆస్తులు సంపాదించు కున్నారు తప్ప ఈ ప్రాంత అభివృద్ధిని గాలికొదిలేశారు” అని ఆయన మండిపడ్డా రు.తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటోందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీని విజయ వం తంగా పూర్తి చేశామని, రాష్ట్రవ్యాప్తం గా 3 కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ పేదలను వోసం చేశారని, తాము పేదల ఆత్మగౌర వం నిలబెట్టేందుకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. మార్చి 31 లోగా వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తామని ప్రకటించారు.

## ఇండిగో సంక్షోభంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం నిర్ణయం



**న్యూఢిల్లీ: డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** ఇండిగో ఫ్లైట్ సర్వీసులు పెద్దఎత్తున రద్దవుతుండటంతో తలెత్తిన సంక్షోభంపై కేంద్రం చర్యలకు దిగింది. ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అర్జెంట్ అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. ఫ్లైట్ సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిసామని తెలిపింది.

2లో

## వరంగల్ జిల్లా ప్రజల పై సీఎం వరాల జల్లు!




**డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా ఆ ప్రాంత అభివృద్ధికి సంబంధించి పలు కీలక ప్రకటనలు చేశారు. హైదరాబాద్ తర్వాత వరంగల్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేస్తూ, హైదరాబాద్‌కు ఏమేమి ఉన్నాయో అవన్నీ వరంగల్‌కు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా, వరంగల్ ప్రాంతంలో కీలకమైన అభివృద్ధి పనులకు డెడ్‌లైన్‌లు ప్రకటించారు. ముఖ్యంగా, వరంగల్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన భూసేకరణ పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేసి, వచ్చే మార్చి 31 లోగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను, ఔటర్ రింగ్ రోడ్డు పనులను కూడా మార్చి 31లోగా మొదలుపెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రకటనలు వరంగల్ ప్రాంత ప్రజల్లో భారీ అంచనాలను పెంచాయి. ఈ పర్యటనలో భాగంగా, వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా రూ. 508.84 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో ప్రధానంగా విద్యా, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేశారు. రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనం, రూ. 130 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల, రూ. 26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం వంటివి ముఖ్యమైనవి. రోడ్ల అభివృద్ధికి కూడా అధిక నిధులు కేటాయించారు. రూ. 82.56

2లో

## అమెరికాకు బిగ్ షాక్..

### ఆ విషయంలో భారత్‌కు అండగా రష్యా..



టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. ‘మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేం దుకు ప్రయత్నాలు జరుగు తున్నా యి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకా రం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టు లు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకా రం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదే శాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడం కుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరి స్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపు నకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకా లు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫ రా చేయడానికి సిద్ధంగా ఉ

2లో

## ఇండిగో విమాన సర్వీసుల రద్దు,,,,

### వర్చువల్‌గా రిసెప్షన్‌కు హాజరైన నవదంపతులు



ఎన్నాళ్లో వేచిన ఉదయం.. ఈనాడే ఎదురౌతుంటే.. ఇన్ని నాళ్లు దాచిన హృదయం.. ఎగసి ఎగసి పోతుంటే.. ఇంకా తెలవారదేమి ఈ చీకటి విడిపోదేమి.. అని పాడుకుని ఉంటారు ఆ నవదంపతులు. పెళ్లి అయితే అయింది, బంధుమిత్రులకు గ్రాండ్‌గా రిసెప్షన్ పార్టీ ఇద్దామని ప్లాన్ చేసుకున్నారు. అన్ని ఏర్పాట్లు అయిపోగా.. వారు తీరిగ్గా సమయానికి వెళ్లొచ్చని అనుకున్నారు. తీరా సమయానికి ఇండిగో విమాన సంస్థ చేసిన పని వారి ప్లాన్ బెడిసికొట్టింది. హుబ్లీకి చెందిన మేధా క్షీరసాగర్, ఒడిశాలోని భువనే శ్వర్‌కు చెందిన సంగమ దాస్ ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వీరు నవంబర్ 23న భువనేశ్వర్‌లో వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత డిసెంబర్ 4 బుధవారం నాడు హుబ్లీలో వధువు స్వస్థలంలో బంధువులు, స్నేహితుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. నవ దంప తులు తమ రిసెప్షన్‌కు హాజరు అయ్యేం దుకు డిసెంబర్ 2వ తేదీన భువనేశ్వర్ నుంచి బెంగళూరు మీదుగా హుబ్లీకి విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే దేశవ్యాప్తంగా నెలకొన్న పైలట్ల కొరత, కొత్త

2లో

## అమెరికాలో భారీ అగ్ని ప్రమాదం..

## ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 13 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్ మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. 13 మందిలో హైదరాబాద్‌కు చెందిన ఉడుముల సహజ రెడ్డి, కూకట్‌పల్లికి చెంది న మరో విద్యార్థి ఉంటున్నారు. శుక్రవా రం అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.మంటలు మొదలైన కొద్దిసేపటికే దట్టమైన పొగ అపార్ట్‌మెంట్ మొత్తం వ్యాపించింది. విద్యార్థులు శ్వాస తీసుకోలేక అల్లాడిపోయారు. గట్టిగా కేకలు వేయటం మొదలెట్టారు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది లోపల చిక్కుకున్న 13 మంది విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. తెలుగు విద్యార్థులిద్దరూ తీవ్రంగా గాయపడ్డంతో వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందు తూ ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు.



## వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు



**డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను ‘ఉమీద్’ పోర్టల్‌లో నవెూదు చేసేందుకు విధించిన గడువును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్వాగతించారు. ఈ అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని,

2లో

## సర్పంచ్‌లకు కేసీఆర్ సన్మానం

**హైదరాబాద్, డిసెంబర్ 05 (నమస్తే హైదరాబాద్) :** బీఆర్ఎస్ పాలనలో గ్రామాలన్నీ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు, వార్డు మెంబర్లను కేసీఆర్ తన ఫాంహౌస్‌కు ఆహ్వానించారు. గ్రామస్థుల మద్దతుతో ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సత్కరించి వారికి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన గ్రామస్థులను గుర్తుపట్టి పేరు పేరునా పలకరించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు.



### తొలి విడతలో 395 ఏకగ్రీవాలు

తొలి విడతలో ఎన్నికల జరగనున్న 4,236 సర్పంచ్ స్థానాల్లో 395 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని 26 స్థానాలు ఉన్నాయి. ఈ 26 మందిలో 25 మంది కాంగ్రెస్ మద్దతుదారులు కాగా ఒకరు టీడీపీకి చెందిన వారు.

# శాంతిపక్షానే భారత్.. పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ

ఇంధన భద్రత కీలకం

భారత్–రష్యా మధ్య భాగస్వామ్యానికి ఇంధన భద్రత అనేది బలమైన స్తంభం వంటిందని, పరస్పర లాభదాయక సహకారాన్ని తాము కొనసాగిస్తామని మోదీ చెప్పారు. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో తమ భాగస్వామ్యం దశాబ్దాల నాటిదని, క్రిటికల్ మినిరల్స్ అంశంలోనూ పరస్పర సహకారం తప్పనిసరని అన్నారు. ఆర్థిక సహకారం పెంపునకు విజన్ 2023 డాక్యుమెంట్‌పై ఉభయదేశాలు సంతకం చేసినట్టు చెప్పారు. ఇండియా–రష్యా బిజినెస్ ఫోరంలోనూ ఈరోజు తామిరువురూ పాల్గొంటామని, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసేందుకు ఇది వేదిక అవుతుందని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. కాగా, ఉక్రెయిన్‌తో శాంతియుత పరిష్కారానికి తాము పని చేస్తున్నట్టు పుతిన్ కూడా ప్రధాని మోదీకి తెలిపారు.

కాగా, దీనికి ముందు పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. తన పర్యటనలో భాగంగా రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుతిన్ నివాళులర్పించారు. మోడ్రన్ ఇండియా వ్యవస్థాపకుల్లో ఒకరిగా, గొప్ప ఫిలాసఫర్‌గా, మానవతావాదిగా మహాత్మాగాంధీ నిలిచారని, ప్రపంచ శాంతికి ఎనలేని కృషి చేశారని పుతిన్ అక్కడి విజిటర్స్ బుక్‌లో రాశారు. స్వేచ్ఛ, మంచితనం, మానవత్వంపై మహాత్మాగాంధీ ఆలోచన నేటికీ నిత్య నూతనమని గుర్తుచేసుకున్నారు.

# ఇండిగో సంక్షోభంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం నిర్ణయం

దర్యాప్తు కమిటీ..

కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.

## ఇండిగో విమాన సర్వీసుల రద్దు,,,,వర్చువల్‌గా రిసెప్షన్‌కు హాజరైన నవదంపతులు

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రోస్టర్ ప్లానింగ్‌లో వైఫ ల్యం కారణంగా ఇండిగో విమానా లు రద్దు అయ్యాయి. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మొదలైన ఆలస్యం.. బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. చివరకు డిసెంబర్ 3వ తేదీన వారి విమానం రద్దు అయింది. భువనేశ్వర్–ముంబై–హుబ్లీ మార్గంలో ప్రయాణించాల్సిన వారి బంధువుల విమానాలు కూడా రద్దు కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. మరోవైపు హుబ్లీలోని బంధువులు, స్నేహితులు రిసెప్షన్ కోసం ఎదురు చూస్తుండగా.. భువనేశ్వర్‌లో చిక్కుకుపోయిన వధూవరులు నిరాశ చెందకుండా ఒక నిర్ణయం తీసుకున్నారు. పెళ్లి దుస్తుల్లో ముస్తాబై, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రిసెప్షన్‌లో చేరారు. స్క్రీన్ పై తమ ప్రియమైన వారిని చూసి, వర్చువల్‌గా ఆశీస్సులు అందుకున్నారు. ఇండిగో విమానాల ఆకస్మిక రద్దు కారణంగా ఈ వారం దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దిల్లీ, జైపూర్, భోపాల్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో విమాన కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. పరిస్థితి తీవ్రతరం కావడంతో, ఇండిగో దేశీయ విమానాలను శుక్రవారం అర్ధరాత్రి వరకు దిల్లీ విమానాశ్రయం నిలిపివేసింది. టెర్మినల్స్‌లో అధిక రద్దీని నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. అర్ధరాత్రిలోపు షెడ్యూల్ అయిన ఇండిగో ప్రయాణీకులు విమానాశ్రయానికి రాకుండా ఉండాలని అధికారులు కోరారు.

# అమెరికాకు బిగ్ షాక్..

## ఆ విషయంలో భారత్‌కు అండగా రష్యా..

న్నాం' అని అన్నారు.

**భారత్‌కు బ్రిక్స్ అధ్యక్ష పదవి** భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపా రు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు.

# ఉనికిచర్ల గీతా కార్మిక సొసైటీ నూతన కమిటీ ఎన్నిక



**డిసెంబర్ 5, హనుమకొండ, (నమస్తే హైదరాబాద్)** ఉనికిచర్ల గ్రామ గీతా కార్మిక సొసైటీ కమిటీ ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షులుగా కోటగిరి రాజు గౌడ్, ఉపాధ్యక్షులుగా నాతి శాంతి కుమార్ గౌడ్, కార్యదర్శిగా కోటగిరి శ్రీనివాస్ గౌడ్ కోశాధికారిగా ఆరేలి రవీందర్ గౌడ్, గౌరవ సలహాదారు తాళ్లపల్లి సతీష్ కుమార్ గౌడ్ గౌరవ సలహాదారులుగా బుర్ర రాజేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు కోటగిరి శివా గౌడ్, నాతి కుమారస్వామి గౌడ్ , ఆరెల్లి చిరంజీవి గౌడ్, నాతి నవీన్ గౌడ్, ఆరేల్లి సాంబరాజు గౌడ్, సట్ల రవీందర్ గౌడ్, ఆరేల్లి రాజు గౌడ్ లను గీతా కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గీతా కార్మిక సొసైటీ అభివృద్ధికి గీతా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ గీత కార్మికులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు, ముతావల్లీలకు ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయంపై కీలక ప్రకటన చేశారు. వక్ఫ్ ఆస్తుల నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసినప్పటికీ, మరో మూడు నెలల పాటు ఎలాంటి జరిమానా విధించబోమని స్పష్టం చేశారు. ఈలోగా నమోదు చేసుకోలేని వారు తమ రాష్ట్రాల్లోని వక్ఫ్ ట్రైబ్యునళ్లను సంప్రదించవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల వక్ఫ్ ఆస్తులకు గాను, ఇప్పటివరకు కేవలం 1.51 లక్షల ఆస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు.గడువు పొడిగించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సాంకేతిక సమస్యలు, శతాబ్దాల నాటి రికార్డుల లభ్యతలో జాప్యం, ముతావల్లీలకు ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆస్తుల వివరాలను కచ్చితత్వంతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు కనీసం ఏడాది పాటు గడువు పొడిగించాలని కోరారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఈ గడువు పొడిగింపు చాలా ముఖ్యం. దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఈ సంస్థల ద్వారా అందే సేవలు, మద్దతు నిరంతరాయంగా కొనసాగుతాయి అని మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# వరంగల్ జిల్లా ప్రజల పై సీఎం రేవంత్ వరాల జల్లు!

కోట్లతో హనుమకొండ–నర్సంపేట–మహబూబాబాద్ నాలుగు లైన్ల రోడ్డు, రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుండి నెక్కొండ రహదారి పనులు, అలాగే అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 20 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు.నర్సంపేటలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంటూ, రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా అందిస్తూ, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తుపై పేటెంట్ హక్కు తమకే ఉందని స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని దోచుకున్నవారికి మాత్రమే కరెంట్ కట్ అయిందని విమర్శించారు. అంతేకాకుండా, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందలేదని, ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి బాధ్యత తీసుకున్నామని ప్రకటించారు. 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో నర్సంపేట నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.

# హబ్సిగూడ డివిజన్ వాసుల పదేళ్ల కల ఫలించింది:కాలనీలకు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

*–ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ కృషితో..*







**ఉప్పల్, డిసెంబర్ 5 ( నమస్తే హైదరాబాద్)** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారం ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్ పటేల్ కృషితో హబ్సిగూడ డివిజన్ కాలనీల ప్రజల పదేళ్ల కళ నెరవేరింది. మూడు రోజుల క్రితం ఉప్పల్ డిపో ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఉదయం ఆర్టీసీ అధికారులు రామ్ రెడ్డి నగర్ సికింద్రాబాద్ 115 %= =%, రామ్ రెడ్డి నగర్– కోటి 18 %= =%, బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ కాలనీ అధ్యక్షులతో కలిసి రామ్ రెడ్డి నగర్, వాసవి నగర్,కామాక్షిపురం,వివేక్ నగర్,శ్రీ నగర్ బాలకృష్ణ కాలనీ, దేవేంద్ర నగర్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకొని సంతోషాన్ని వ్యక్తపరుస్తూ పూజలు నిర్వహించి బస్సులను ప్రారంభించారు. ఆయా కాలనీల వాసులు బస్సు రవాణా లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అరుణ్ పటేల్ దృష్టి తీసుకురావడంతో బస్తి ప్రజలు ఇబ్బంది పడొద్దని వెంటనే స్పందించి ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పరమేశ్వర్ రెడ్డి మాట్లాడి ఎట్టకేలకు బస్సులను ప్రారంభమయ్యేలా చేశారు. తమ కాలనీలకు ఆర్టీసీ బస్సులు రావడానికి కృషిచేసిన పరమేశ్వర్ రెడ్డి ఆకారపు అరుణ్ పటేల్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.10 సంవత్సరాల తరువాత హబ్సిగూడ డివిజన్లోని లోపల కాలనీలకు ఆర్టీసీ బస్సులు రావడం పట్ల కాలనీ ప్రజల్లో చెప్పలేనంత



ఆనంద ఉత్సవాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ట్రస్మా లీడర్స్ ని సన్మానించిన చిన్న జీయర్ స్వామి



**ఉప్పల్, డిసెంబర్ 5 ( నమస్తే హైదరాబాద్):** గీతా జయంతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, గౌరవ ప్రెసిడెంట్ శేఖర్ రావు ,ఉప్పల్ మండల ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, ఉప్పల్ ఈసీ బాడీకి చిన్న జీయర్ స్వామి కృతజ్ఞతలు తెలియజేసి వారిని గౌరవపూర్వకంగా సన్మానించారు.



పిల్లలకు అవసరమైన మోటివేషన్ మరియు మార్గదర్శక కార్యక్రమాలు అందించడానికి చిన్న జీయర్ స్వామి వారు ప్రత్యేకంగా ప్రామిస్ చేశారు. ఈ అవకాశం ఇచ్చిన స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, హానరరి ప్రెసిడెంట్ శేఖర్ రావు, ఉప్పల్ మండల ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.


# చంద్రబాబుతో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ

**నమస్తే హైదరాబాద్):** తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025'కు హాజరుకావాల్సిందిగా చంద్రబాబును ఆయన ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది.డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ సదస్సును ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో నిర్వహిస్తున్నామని చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం తరఫున అధికారికంగా ఆహ్వానాన్ని అందించిన కోమటిరెడ్డి, సమ్మిట్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రికి తెలియజేశారు.



# 36 వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ లో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్





**ఉప్పల్, డిసెంబర్ 5 ( నమస్తే హైదరాబాద్):** చిల్కానగర్ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మహా పడిపూజలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎద్దుల కొండల రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, ఫోటో బాలు ముధం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్పోరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల నియమాచరణ సేవా భావాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో చేస్తారని పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటానని రేవంత్ రెడ్డి హామీ



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తానని, అవసరమైతే ఢిల్లీతోనైనా పోరాడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే ఢిల్లీనైనా ఎదుర్కొంటానని, నిధుల కోసం వెనుకాడేది లేదని తేల్చి చెప్పారు.ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి నిధులు అడగడం, అనుమతులు కోరడం ముఖ్యమంత్రిగా తన బాధ్యత అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విషయాల కోసం ఎంత దూరమైనా వెళ్లే ఓపిక, వయస్సు తనకు ఉన్నాయని, సమస్యను వివరించే పరిజ్ఞానం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం సాయి ఈశ్వర చారి ఆత్మ బలిదాన ఘటన బాధాకరం

*నేర్దం భాస్కర్ గౌడ్, ఉప్పల్ నియోజకవర్గ బీసీ జేఏసీ నేత*





**ఉప్పల్, డిసెంబర్ 5 ( నమస్తే హైదరాబాద్):** 42%రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయనే బాధతో పీర్జాదిగూడలో ఆత్మహత్యాయత్నం చేసిన సాయి ఈశ్వర చారి మృతి చెందిన ఘటన తీవ్రంగా కలచి వేసిందని ఉప్పల్ నియోజకవర్గం బిసి జేఏసీ నాయకులు, మలిదశ ఉద్యమకారులు నేర్దం భాస్కర్ గౌడ్ అన్నారు. సాయి ఈశ్వర చారి ఆత్మహత్య పాల్పడి మృతి చెందిన సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘాలు, బీసీ జేఏసీ నాయకులతో కలిసి నేర్దం భాస్కర్ గౌడ్ గాంధీ ఆసుపత్రి ముందు నిరసన ధర్నా లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించారని దానిని అమలు చేయాలని కోరుతున్నామే తప్ప హక్కుల కోసం పోరాటమే, అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీసీ%-%బహుజన యువకులు ఇలాంటి చర్యలకు దిగడం మన సమాజానికి బాధాకరమని పేర్కొన్నారు.

తెలంగాణ సాధనలో 12వందల మందికి పైగా బీసీ, బహుజన, వంచిత వర్గాల బిడ్డలు తమ ప్రాణాలు అర్పించారు. ఇక చాలు, ఇక నుంచి బలిదానాలు కాదు, పోరాటమే మార్గంమని వెల్లడించారు.

మన హక్కులు, మన రిజర్వేషన్లు, మన గౌరవం ఆత్మహత్యలతో రాదని స్పష్టం చేశారు. ఐక్యత, స్ఫూర్తి, రాజకీయ చైతన్యంతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు.మన లక్ష్యం సాధించాలంటే మనం బలంగా, చైతన్యంగా, ఒకటిగా నిలబడాలి.

ఇకపై ఎవరూ ఇలాంటి చర్యలు చేయకండి. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. అది మన ఓటు ద్వారా, మన ఆత్మగౌరవం ద్వారా, మన పోరాటం ద్వారా నిర్మించబడుతుంది.మన హక్కులను పోరాటం ద్వారా సాధించు కుందాము, మన ప్రాణ త్యాగాల ద్వారా కాదు, మన రాజకీయ సంకల్పం, నిస్వార్థ పోరాటం ద్వారానే అవుతుందన్నారు.

తెలంగాణ మళ్లీ బలిదానాల గడ్డ కాకూడదు, పాలన, గౌరవం, న్యాయం, హక్కులకు అడ్డా కావాలని వెల్లడించారు.మనకు మోసం చేసినవారికి ఓటు ద్వారానే సమాధానం చెప్పాలి.మహనీయులు ఫూలే, అంబేడ్కర్, కాన్షీరాం చూపిన మార్గంలో నడుద్దాం, మన ఆశయాన్ని సాధిద్దాం అని నేర్థం భాస్కర్ వెల్లడించారు.

# హైదరాబాద్‌లో ఈ ఏరియాలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే




హైదరాబాద్‌లోని హైటెక్ సిటీకి అతి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసాపేట్ సర్కిల్, అల్లాపూర్ డివిజన్ ప్రస్తుతం అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూముల ధరలకు, ఇళ్ల అద్దెలకు రెక్కలు రావడంతో.. చిన్నపాటి స్థలాల్లో సైతం ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు.

మాదాపూర్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ వంటి ప్రముఖ ప్రాంతాలకు అల్లాపూర్ డివిజన్ సమీపంలో ఉండటంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ విలువ అమాంతం పెరిగింది. 50 గజాల నుంచి 300 గజాల వరకు ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కోట్లలో లాభాలు వస్తుండడం.. నెలనెల వేలల్లో అద్దెలు వస్తుండడంతో నిర్మాణదారులు జీహెచ్ఎంసీ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని పద్మావతి నగర్, గాయత్రి నగర్, వివేకానంద నగర్, పర్వత్ నగర్, జనప్రియ నగర్, లక్ష్మీ నగర్, తులసి నగర్, ఫ్రెండ్స్ కాలనీలు అక్రమ నిర్మాణాలకు కేంద్రాలుగా మారుతున్నట్లు తెలుస్తోంది.

ఈ కాలనీలలో కేవలం 50 గజాల స్థలాల్లో సైతం బహుళ అంతస్థుల భవనాలు కనిపిస్తున్నాయి. నిర్మాణదారులు ఇళ్ల నుంచి ఆదాయాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టేస్తున్నారు. నిర్మాణదారులు పనులు చేపట్టే సమయంలో కనీసం సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేస్తున్నారు. దీనివల్ల ఇళ్లకు ఇళ్లకు మధ్య కనీసం గాలి, వెలుతురు కూడా దూరే అవకాశం లేకుండా పోతోంది. ఒక ఇల్లు మరో ఇంటికి అతుక్కుని ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి.

దీనివల్ల ఆ ప్రాంత నివాసితులు వెంటిలేషన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ.. సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిర్మాణదారులు తమ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం లేదా సహకారం కారణంగానే ఈ అక్రమ నిర్మాణాలు శరవేగంగా వెలుస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ అక్రమ కట్టడాలు భవిష్యత్తులో స్థానిక నివాసితులకు పారిశుధ్యం, అగ్నిమాపక భద్రత వంటి సమస్యలను తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది.

# ప్రీ క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్





**ఉప్పల్, డిసెంబర్ 5 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ డివిజన్ లోని కేకేఆర్ గార్డెన్ భరత్ నగర్ లో ఏర్పాటు చేసిన ప్రీ క్రిస్మస్ ప్రత్యేక ప్రార్ధన, 14వ సముద్ర జల ప్రవాహాల పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమంలో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ హోలీ టెంపుల్ బ్రదర్ జె తేజు మై ముఖ్య వాక్యోపదేశకులు వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రీ క్రిస్మస్ కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేయడం దానికి ప్రభువు సేవకులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఆ ప్రభు ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతున్నారని అన్నారు. తనను కార్పొరేటర్ కావడానికి సహకరించిన ప్రతి ఒక్క సోదరి సోదరీమణులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ డివిజన్ పరిధిలోని , ఎక్కడ ప్రార్ధన మందిరాలు కట్టుకున్న తాను పూర్తి సహకారాన్ని అందించాలని, మునుముందు కూడా వారి సహకారం ఉంటుందని అన్నారు.

కెసిఆర్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క క్రిస్టియన్ సోదరునికి సోదరీమణునికి క్రిస్మస్ గిఫ్ట్ లు అందాయని , ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికైనా ప్రతి ఒక్కరికి క్రిస్మస్ గిఫ్టులు అందే విధంగా ప్రభుత్వం చూడాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ గోనె ఫిలిప్స్ మరియు వివిధ ప్రార్ధన మందిరాల పాస్టర్లు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణలో చలి తుఫాను..

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే పది రోజుల్లో తీవ్రమైన చలి గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఈ చలి తాకిడి రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతుందని, ప్రజలు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు లేకుండా పూర్తిగా పొడి వాతావరణం కొనసాగుతుందని, ఇది వ్యవసాయం మరియు రోజువారీ జీవనానికి సవాలుగా మారవచ్చని నిపుణులు తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఈ అంచనాలను ధృవీకరించింది, ప్రజలకు అప్‌డేట్స్ అందించాలని ప్రణాళిక వేసింది.ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ఈ రోజు నుంచే బలమైన చలి గాలులు ప్రారంభమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ గాలులు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఎక్కువగా ప్రభావితం చేస్తాయని, ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతాయని తెలిపారు. ప్రజలు వెలుతురు ధరించడం, వెచ్చని ఆహారాలు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో మరింత తీవ్రత ఉండవచ్చని, స్థానిక అధికారులు మానిటరింగ్ చేస్తామని తెలిపారు.హైదరాబాద్ నగరంలో రేపటి నుంచి చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. నగర ప్రధాన చోట్లలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు దిగిపోవచ్చని, ఇది రోజువారీ ట్రాఫిక్ మరియు బయటి కార్యక్రమాలను ప్రభావితం చేస్తుందని అంచనా. పార్కులు, ఓపెన్ స్పేస్‌లలో ఉండే వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ చలి పరిస్థితి నగరంలో ఆరోగ్య సమస్యలను పెంచవచ్చని, ఆసుపత్రులు సిద్ధంగా ఉండాలని ఆరోగ్య శాఖకు సూచనలు జారీ చేశారు.ఈ నెల 11వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పూర్తి పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ కాలంలో వర్షాలు పడే అవకాశం లేకపోవడంతో, నీటి సమస్యలు మరింత తీవ్రమవుతాయని నిపుణులు హెచ్చరించారు.

# లారీలు అందుబాటులో ఉండాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉండాలని రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం బోయినపల్లి, కోనరావుపేట మండలాల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీల కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, లారీలకు కొరత లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత, డీసీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో 4 రోజుల్లో రూ. 600 కోట్ల మద్యం తాగేశారు



తెలంగాణలో మద్యం అమ్మకాలు మళ్లీ రికార్డు సృష్టించాయి. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు భారీగా మద్యం అమ్ముడుపోయింది. నాలుగు రోజుల్లో దాదాపు రూ. 600 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే లిక్కర్ సేల్స్ 107 శాతం పెరిగినట్లు వెల్లడించారు. ఆసక్తికర విషయం ఏంటంటే.. తెలంగాణలో చలి పులి పంజా విసురుతున్నా.. బీర్ల అమ్మకాలు జోరుగా సాగాయి. చల్ల గాలిలోనూ చిల్డ్ బీర్లు తాగి ఎంజాయ్ చేస్తున్నారట తెలంగాణ మద్యం ప్రియులు. అందుకే నాలుగు రోజుల్లోనే 5.89 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది నాలుగు రోజుల్లో 4.26 లక్షల కేసుల బీర్లు మాత్రమే అమ్ముడు కావడం గమనార్హం.

తెలంగాణ వ్యాప్తంగా మద్యం సేల్స్ జోరుగా సాగుతున్నాయి. డిసెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ రాత్రి వరకు 578.86 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. 2023-2025 పాత మద్యం పాలసీ గడువు ఆదివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ రెండేళ్లలో మద్యం అమ్మకాలు పెరిగాయని తెలుస్తోంది. గత రెండు సంవత్సరాల్లో 724 లక్షల కేసుల లిక్కర్, 960 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయని సమాచారం. కాగా, 2023లో మద్యం పాలసీ ప్రారంభం కాగా.. డిసెంబర్‌లో ఏకంగా రూ. 4,297 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఆ తర్వాత 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు రూ. 37,485 కోట్ల లిక్కర్ తాగేశారు మద్యం ప్రియులు. ఇక 2025లో జనవరి నుంచి నవంబరు వరకు రూ. 29,766 కోట్ల అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి.

లిక్కర్ సేల్స్ పెరగడానికి కారణాలివే..

తెలంగాణలో లిక్కర్ సేల్స్ రికార్డ్ సృష్టించడానికి.. కొత్త మద్యం పాలసీతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు కారణమని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. కాగా సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడికక్కడ దావత్‌లు జరుగుతున్నాయి. దీంతో లిక్కర్‌కు డిమాండ్ పెరిగింది. కాగా, ఇంతకుముందు దసరా సందర్భంగా కూడా తెలంగాణలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గమ్మత్తైన విషయం ఎంటే.. దసరా పండుగా, గాంధీ జయంతి ఒకే రోజు వచ్చినా.. మద్యం అమ్మకాల జోరుగా సాగాయి.

ఈ ఏడాది దసరా పండుగకు రూ. 419 కోట్ల మద్యం తాగేశారు మద్యం ప్రియులు. ఇదిలా ఉండగా, మునుగోడు నియోజకవర్గంలో మాత్రం మద్యం షాపుల నిర్వహణపై షరతులు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్యం షాపుల నిర్వహణపై తనదైన శైలిలో కొన్ని షరతులు విధించారు. అందులో భాగంగా ఊరి చివరనే మద్యం షాపులు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే అమ్మకాలు, పర్మిట్ రూములకు సాయంత్రం 6 గంటల తర్వాతే అనుమతిస్తున్నారు.

# తెలంగాణలో 9 మంది పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగం పుంజుకుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి.. ఈ పథకం పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను తిరిగి పునరుద్ధరించామని మంత్రి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటివరకు దాదాపు 4 లక్షల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వీటిలో 3 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి.. వచ్చే ఏడాది మార్చి నాటికి 1 లక్ష, జూన్‌కు మరో 2 లక్షల గృహ ప్రవేశాలు జరిపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఇప్పటికే మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని.. అర్హులైన పేదలందరికీ ఇళ్లు వస్తాయని హామీ ఇచ్చారు.జీహెచ్ఎంసీతో సహా రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లో పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి ప్రణాళిక సిద్ధమైంది. పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా.. వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే జీ౦3 పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేలా త్వరలో ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ పాలసీని ప్రకటించబోతున్నారు. ఓఆర్ఆర్ చుట్టూ నాలుగు స్థలాలను గుర్తించామని.. ఒక్కో చోట 8 వేల నుంచి 10 వేల ఇళ్లు నిర్మించే ప్రతిపాదన ఉందని మంత్రి తెలిపారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న పాత ఇళ్లను తొలగించి.. వాటి స్థానంలో హైరైజ్ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆలోచన చేస్తున్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 2%దీ౹ఖ% ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ. 700 కోట్లు, మౌలిక వసతుల కోసం రూ. 200 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించి.. 394 మంది డీఈఈలను తిరిగి రప్పించి.. 800 మంది ఏఈలను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్నారు. వివిధ శాఖల నుంచి అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకుని వ్యవస్థను పటిష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో చేతివాటం చూపిన 9 మంది పంచాయతీరాజ్ కార్యదర్శులను సస్పెండ్ చేశామని.. మరో ఇద్దరిని సర్వీసు నుంచి తొలగించామని మంత్రి స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు అమలు చేస్తామని హెచ్చరించారు. హౌసింగ్ బోర్డు భూములను కబ్జా చేసిన వారి నుంచి వెయ్యి ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

# 1800 ఎకరాల భూమి నిషేధిత జాబితాలోకి,,,, తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం



22ఏ జాబితా.. దీని గురించి సామాన్యులకు పెద్దగా తెలియకపోవచ్చు కానీ.. భూముల క్రయవిక్రయాలు జరిపేవారికి 22ఏ జాబితా గురించి బాగా తెలుసు. ప్రభుత్వ నిషేధిత భూములు ఈ జాబితాలో ఉంటాయి. ఒక్కసారి భూములు ఈ జాబితాలో చేరితే వాటిని అమ్మడం, కొనడం చేయలేము. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఒకటి, రెండు కాదు.. ఏకంగా 1800 ఎకరాల భూమిని నిషేధిత జాబితా(22ఏ)లో చేరుస్తూ ఆదేశాలు జారీ చేసింది.

హైదరాబాద్ నగరంలోని శేరిలింగంపల్లి మండలంలో ఉన్న గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామంలోని 1,800 ఎకరాల భూములను ప్రభుత్వం నిషేధిత జాబితా (22ఏ)లోకి చేర్చింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం ఈ గ్రామంలో గల భూమిలోని దాదాపు 3వ వంతు భూమిని.. నిషేధిత జాబితాలోకి చేర్చడం సంచలనంగా మారింది. గత 20 సంవత్సరాలుగా.. ఇక్కడ వెలిసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్న భూమి కూడా ఈ జాబితాలో చేరడంతో వీటి యజమానులు, ఈ భూముల మీద బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా అధికారులు.. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌కు లేఖ రాసి.. గోపల్‌పల్లిలోని 18 సర్వే నంబర్లను 22ఏ జాబితాలో చేర్చాలని కోరారు. దీంతో, ఆ భూముల్లో లావాదేవీలను నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఈ జాబితాను పొందుపరిచారు. ఈ భూముల విలువ సుమారు 27 వేల కోట్ల రూపాయలకు పైమాటే అంటున్నారు.

ఈ నిషేధిత సర్వే నంబర్లలో చేర్చిన భూముల్లో వందలాది ఐటీ కంపెనీలు, ఎకరాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలతో పాటుగా అనేక ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ప్రభుత్వం పలు ఉద్యోగ శాఖలు, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూములు ఈ నిషేధిత జాబితాలో చేర్చడం గందరగోళంగా మారింది.

గోపన్‌పల్లిలోని 18 వేర్వేరు సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ రికార్డులలో వీటిని ప్రభుత్వ స్థలంగా పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంతో పాటు దేవాదాయ శాఖ, లావాణి పట్టాలు కూడా ఉన్నాయి. రెండు రోజుల క్రితమే శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ జాబితా చేరింది. దీంతో ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను నిలిపివేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామం.. ఐటీ కారిడార్‌లో భాగంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే టీసీఎస్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పైగా ఈ గ్రామం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూముల విలువ విపరీతంగా పెరిగింది. ఈ ప్రాంతంలో సగటున ఎకరం ధర రూ.150 కోట్లు అనుకుంటే... మొత్తం 1,800 ఎకరాల విలువ బహిరంగ మార్కెట్లో రూ.27 వేల కోట్ల పైమాటే అని అంచనా వేస్తున్నారు.

# హైదరాబాద్ నగరంలో పడిపోతున్న గాలి నాణ్యత



దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్న సంగతి తెలిసిందే. శీతాకాలంలో పరిస్థితి మరింత దిగజారుతోంది. ప్రపంచంలోకెల్లా అత్యంత దారుణమైన వాయు నాణ్యత కలిగిన నగరంగా ఢిల్లీ ఉంది. పరిస్థితి చేజారాక ఎన్ని ప్రయాత్నాలు చేసినా ఫలితాలు రావడం లేదు. ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షం కురిపించి, కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా వాయు నాణ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో స్వచ్ఛమైన గాలి దొరకడం కష్టంగానే మారుతోందని నివేదికలు చెబుతున్నాయి.

ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ).. ఒక్క రోజు కూడా నాణ్యమైన గాలి (గుడ్ ఎయిర్) లేదని నివేదికలు చెబుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో డిసెంబరు నెల వాయు కాలుష్యం (ఏక్యూఐ) పరిశీలిస్తే.. ఈ ఏడాది డిసెంబర్‌లో అత్యధిక స్థాయిలో నమోదు అవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణాల ప్రకారం ఏక్యూఐ 50 లోపు ఉంటే స్వచ్ఛమైన గాలిగా పేర్కొంటారు. అయితే హైదరాబాద్‌లో 2025 జనవరి నుంచి గడచిన 337 రోజుల్లో.. 203 రోజులు సాధారణ స్థాయిలో ఉండగా.. 110 రోజులు పూర్ ఏక్యూఐ నమోదు అయింది. ఇక 23 రోజులు అన్‌హెల్తీగా గాలి నాణ్యతను పేర్కొన్నారు. 2022 నుంచి డిసెంబరు నెల వాయు నాణ్యత సూచీ పరిశీలిస్తే.. ఈ ఏడాది 185గా ఉంది.

హైదరాబాద్‌లోని ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో బుధవారం ఏక్యూఐ 253గా నమోదు అయింది. అదే సమయంలో అమీన్‌పూర్‌లో 201గా ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కూడా ఢిల్లీ వైపు అడుగులు వేస్తోందని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి హైదరాబాద్‌లో వాయు నాణ్యత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హైదరాబాద్‌లో గాలి నాణ్యత తగ్గడానికి కారణాలివే..

దుమ్ము గాలిలోకి లేవడం.. హైదరాబాద్‌లో గాలి నాణ్యత పడిపోవడానికి ప్రధాన కారణం. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో అధికంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో నిర్మాణ ప్రదేశాలలో మట్టిని తవ్వడం, భవనాలు కూల్చడం, సిమెంట్, ఇసుక తరలించడం వంటి కారణాలతో ధూళి కణాలు పైకి లేస్తున్నాయి. దీంతో పాటు రోడ్లపై ఎక్కడికక్కడే మట్టి పేరుకుపోయి ఉండటం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. వాహనం వెళ్లిన ప్రతిసారి ధూళి కణాలు గాల్లోకి లేస్తున్నాయి.

వీటికి తోడు భారీ పరిశ్రమల నుంచి విడుదలయ్యే ఉద్గారాల వల్ల వాయు నాణ్యత పడిపోతోంది. అయితే వాయు కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం సరైన విధానాలు అనుసరించడం లేదనే వాదన ఉంది. వాయు కాలుష్యాన్ని ఒక నగరానికి పరిమితం చేసి చర్యలు చేపట్టడం సరికాదని.. ఒక ప్రాంతం మొత్తంగా చర్యలు తీసుకోవాలంటున్నారు. ఢిల్లీలా పరిస్థితి చేజారకముందే ప్రభుత్వం మేల్కొని కాలుష్య కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# హైదరాబాద్‌లో రూ.1.40 కోట్లతో కొత్త రోడ్లకు శంకుస్థాపన



ఖైరతాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గ పరిధిలోని ముఖ్య ప్రాంతాలైన హిమాయత్‌నగర్, నారాయణగూడలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి రూ. 1.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన ఇటీవల శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన పారిశుధ్యం, రవాణా ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టారు.డ్రైనేజీ, రోడ్ల పనులతో మెరుగైన మౌలిక సదుపాయాలు..

వర్షాకాలంలో హిమాయత్‌నగర్, నారాయణగూడ వంటి ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. ఈ నిధులను ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, కొత్త రోడ్ల నిర్మాణానికి వినియోగించనున్నారు. రూ. 1.40 కోట్ల నిధులతో కొత్తగా రోడ్లు వేయడం, పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో మరింత సామర్థ్యం ఉన్న కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పనుల ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు.. రోడ్లు మెరుగవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తగ్గుతాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన ప్రథమ కర్తవ్యమని ఉద్ఘాటించారు. రాజకీయ అంశాల గురించి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశిస్తే.. తాను సిద్ధంగా ఉన్నానని పరోక్షంగా తెలిపారు. తనకు ఎన్నికల పోరాటం కొత్త కాదని, గతంలో 11 సార్లు తాను ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉందని.. ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రాధాన్యత ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే తన ధ్యేయమన్నారు.

# బస్వాపూర్ పంచాయతీ ఎన్నికల్లో మహిళా శక్తి..




మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని బస్వాపూర్ గ్రామం పంచాయతీ ఎన్నికలు రాజకీయ కక్షణానికి దారితీస్తున్నాయి. ఈ చిన్న గ్రామంలో గత ఏడాది నుంచి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి, ముఖ్యంగా మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. గ్రామసభల్లో ప్రజలు భవిష్యత్తు ప్రణాళికలు చర్చిస్తున్నారు, ఇది ఎన్నికల వాతావరణాన్ని మరింత ఉత్కంఠకరంగా మార్చింది. ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళా నాయకత్వానికి కొత్త ఆవిష్కరణలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ భార్య అయిన నజ్మా సుల్తానా, గతంలో కార్పొరేటర్‌గా విజయవంతంగా పనిచేసిన అనుభవజ్ఞురాలు. ఆమె ఇటీవల ఈ గ్రామంలో నివసించడం ప్రారంభించి, స్థానికులతో సన్నిహితంగా మమేకమవుతున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన ఆమె, ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి పోటీ చేస్తున్నారు. ఆమె రాజకీయ జీవితంలో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని స్థానిక నాయకులు చెబుతున్నారు. నజ్మా సుల్తానా పోటీలో ప్రధాన లక్ష్యాలుగా గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనను ప్రకటించారు. గ్రామంలో రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థలు మెరుగుపరచడంతో పాటు, మహిళా సాధికారత కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఆమె చెప్పారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలకు ఆర్థిక సహాయం అందించి, వారిని ఆత్మనిర్భరులను చేయాలనే ఆమె ఆలోచనలు ప్రజల్లో మంచి స్పందన కలిగించాయి. ఈ కార్యక్రమాలు అమలైతే గ్రామం కొత్త ఎదుగుదల చెందుతుందని ఆమె నమ్మకంగా చెబుతున్నారు.

# నగరంలో రెండు రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం..




**సంగీత ప్రియులను అలరించనున్న కృష్ణవేణి సంగీత నీరాజనం..**

**రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం..**

**కేంద్ర టూరిజం శాఖ సంచాలకులు (సౌత్) డి. వెంకటేశన్.**

**నమస్తే హైదరాబాద్ :** కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ లు (సంగీత నాటక అకాడమీ), రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ నెల 6, 7 తేదీల్లో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 2025 ఎడిషన్ కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కేంద్ర టూరిజం శాఖ సంచాలకులు (సౌత్) డి. వెంకటేశన్ తెలిపారు. గుణదలలోని పార్క్ హయత్ హోటల్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శుక్రవారం కేంద్ర టూరిజం శాఖ సంచాలకులు (సౌత్) ఆర్. వెంకటేషన్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆశా) అధ్యక్షులు రామిశెట్టి వీరాస్వామి లు కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 6 వ తేదీ ఉదయం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాంస్కృతిక కేంద్రంగా తరచుగా పరిగణించబడే విజయవాడ ఈ ప్రాంతానికున్న గొప్ప సంగీత వారసత్వాన్ని పురస్కరించుకొని సంగీత ప్రియులను అలరించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో శాస్త్రీయ కర్ణాటక సంగీతాల సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా 2025 సంవత్సరానికి తెలుగు సంగీత సంప్రదాయాల గొప్పతనం అనే థీమ్ సంగీత సంప్రదాయాలను హైలైట్ చేస్తుందన్నారు. హరికథ, సంకీర్తన, వీణా కచేరీలు, గాత్ర కచేరీలు, పంచరత్న కృతులు వంటి సామూహిక ప్రదర్శనలు ఉంటాయని, ప్రఖ్యాత సంగీత కళాకారులు, రాష్ట్రంతోపాటు, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సంగీత సంస్థలు నుండి విద్యార్థులు పాల్గొంటారన్నారు. కృష్ణవేణి సంగీత నీరాజనం దాని సంగీత ప్రదర్శనలతోపాటు క్రాఫ్ట్ బజార్లు, చేనేత ప్రదర్శనలు, స్థానిక కళాకారులు, నేత కార్మికులు సమగ్ర సాంస్కృతిక ప్రదర్శనలు అందిస్తారన్నారు. కృష్ణవేణి సంగీత నీరాజనం సంగీత ప్రియులను, విద్యార్థులను, సాంస్కృతిక ఔత్సాహికులను, వారసత్వం, భక్తి మరియు కళాత్మకత మరపురాని వేడుకలకు స్వాగతిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆశా) అధ్యక్షులు రామిశెట్టి వీరా స్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు, సాంస్కృతిక (సంగీత నాటక అకాడమీ), స్టార్ హోటల్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహిస్తున్నామన్నారు. సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చేతివృత్తులు, నేత కార్మికులకు ప్రోత్సాహకరంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే కృష్ణ వేణీ సంగీత నీరాజనంలో 98 మంది కళాకారులతో మొత్తం 18 కచేరీలు కనువిందు చేయనున్నాయని స్వామి తెలియజేశారు. తదనంతరం కృష్ణ వేణీ సంగీత నీరాజనం కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు.

# విద్యార్థులకు సర్కార్ గుడ్ న్యూస్.. సూపర్ స్కీమ్ ప్రకటించిన సీఎం చంద్రబాబు..

**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొస్తామని, ఉన్నత విద్యకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా భామిని గ్రామంలోని ఏపీ మోడల్ హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశీ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం కీలక పథకాన్ని ప్రకటించారు. “ఉన్నత విద్యకు, విదేశీ విద్యకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది. దీనికోసం కలలకు రెక్కలు పథకాన్ని ప్రారంభిస్తున్నాం. విదేశీ విద్య కోసం ఎంత ఖర్చు అవుతుందో ఆ మొత్తం పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తాం” అని బాబు స్పష్టం చేశారు. విదేశీ విద్య కోసం విద్యార్థులు తమ కోరికలను చంపుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.విద్యా రంగంలో కీలక సంస్కరణలు

ముఖ్యమంత్రి పీటీఎం 3.0 వేదికగా రాష్ట్ర విద్యా రంగంలో తీసుకుంటున్న నిర్ణయాలను వివరించారు: విద్యార్థుల బలాబలాలను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ఉపయోగిస్తున్న క్లిక్కర్ టూల్ విధానం అద్భుతంగా పని చేస్తోందని సీఎం కితాబిచ్చారు. ఇది పిల్లల్లో ఆసక్తిని పెంచుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి టీచర్‌కు కేవలం 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని.. ప్రైవేట్ స్కూళ్లలో 25 మంది ఉన్నారని తెలిపారు. అంటే ప్రభుత్వ స్కూళ్లే మెరుగైన బోధన అందిస్తున్నాయని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, స్టూడెంట్ కిట్స్ నాణ్యతను పెంచామని, స్టూడెంట్ కిట్లపై పార్టీ రంగులు, చిహ్నాలు, ఫొటోలు లేకుండా అందిస్తున్నామని చెప్పారు.

విలువలతో కూడిన విద్య

విలువలతో కూడిన విద్యను అందించే ఉద్దేశంతో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల ద్వారా విద్యార్థులకు విలువలను నేర్పిస్తున్నామని సీఎం తెలిపారు. మెగా డీఎస్సీని సమర్థంగా నిర్వహించి, ఏడాదిలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని, టీచర్లను గౌరవించే బాధ్యత తమదని సీఎం అన్నారు. రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవ్వరూ ఊహించని ఫలితాలు వస్తాయి.. దీనికి అందరూ సహకరించాలి. మూడేళ్లలో దేశంలోనే నెంబర్ వన్ చేసేలా ఆంధ్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెస్తానని మంత్రి



లోకేష్ చెప్పారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారు. నేను అనుకున్నదానికంటే విద్యా విధానం మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా వాటిని అందిపుచ్చుకుంటున్నారు” అని చంద్రబాబు అన్నారు.స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్..విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికను సీఎం ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరిలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. 7వ తరగతి నుంచి విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి, గ్రూప్‌గా లేదా వ్యక్తిగతంగా ఇన్నోవేషన్స్ చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతిభావంతులకు రివార్డులు అందిస్తామని, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఈ సదస్సుకు ఆహ్వానిస్తామని తెలిపారు.సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తన తల్లి భువనేశ్వరి తనను స్టాన్‌ఫోర్డ్ స్థాయి వరకు తీసుకెళ్లారని.. ఇప్పుడు రాష్ట్ర విద్యార్థులందరినీ ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత లోకేష్‌దేనని సూచించారు. ఇక బప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# రాష్ట్రానికి పెట్టుబడుల కోసం మంత్రి లోకేశ్ విదేశీ పర్యటన



**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆయన అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించనున్నారు.పర్యటనలో భాగంగా డిసెంబర్ 6న లోకేశ్ అమెరికాలోని డల్లాస్‌లో జరిగే తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 8, 9 తేదీల్లో శాన్ ఫ్రాన్సిస్కో వేదికగా పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10వ తేదీన కెనడాలోని టొరంటోలో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి.గత 18 నెలల కాలంలో పెట్టుబడుల సాధన కోసం లోకేశ్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న బ్రాండ్ ఇమేజ్, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించడంలో ఈ పర్యటనలు విజయం సాధించాయి. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు భారీగా పెట్టుబడులు తరలిరావడంలో ఈ పర్యటనలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో లోకేశ్ అమెరికాలో పర్యటించడం ద్వారా గూగుల్ ను రాష్ట్రానికి రప్పించగలిగారు. ఈసారి కూడా లోకేశ్ భారీ పెట్టుబడులు సాధించుకువస్తారని కూటమి ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# మీఆలోచనలు సమాజానికి ఉపయోగపడాలి

**నమస్తే హైదరాబాద్ :**గోలు సబర్బన్: నేటి యువత ఆలోచనలు, మేధోసంపత్తి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కార దిశగా ఉండటంతో పాటు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ట్రిపుల్ ఐటీ, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో గురువారం నిర్వహించిన ఐడియా టు ఇంపాక్ట్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డీవీఆర్ మూర్తి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి రవితేజ, సీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావు, ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఒంగోలు మెట్రో: అపర చాణిక్యుడిగా పేరు పొందిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య మన జిల్లా ప్రకాశం జిల్లా వాసి కావడం మన అదృష్టవని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఒంగోలు ఆర్టీసీ డిపో వద్ద గల ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యాలయం, వాసవీ భవన్లో కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా, తమిళనాడు గవర్నర్గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి పేరు తెచ్చారని కొనియాడారు. అంతకుముందు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొని రోశయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసిరావు, మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ముప్వల శ్రీనివాసులు, కొల్లిపర్ల సురేష్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు తాతా గుప్తా, జలదంకి కృష్ణారావు, శ్రీనివాసరావు, దుద్దు రంగనాయకులు జెమినీ నాగేశ్వరరావు, అచ్యుత సత్యం తదితరులు పాల్గొన్నారు....



# మీ కలలకు మా రెక్కలు

**ఆవిష్కర్తలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.. వచ్చే ఏడాది సదస్సు**

**మంచి ఆలోచనలకు అవార్డులు**

**ఉన్నత విద్యకు కొత్త పథకం ‘కలలకు రెక్కలు’**

**విదేశీ విద్యకు పావలా వడ్డీకి రుణాలు**

**ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు**

**ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం**

**విద్యారంగంలో లోకేశ్ మార్పులు**

**మూడేళ్లలో విప్లవాత్మక ఫలితాలు**

**గతంలో విద్యారంగంపై రాజకీయ నీడ**

**మెగా పీటీఎంలో చంద్రబాబు వెల్లడి**

**బడిని బాగుచేద్దాం.. లోకేశ్ పిలుపు**



**నమస్తే హైదరాబాద్ :** శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. నేను ఊహించిన దానికంటే విద్యావిధానం ఎంతో మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా అంతే ఉత్సాహంగా చదువుల్లో రాణిస్తున్నారు. మట్టిలో మాణిక్యాలకు సరైన మార్గనిర్దేశం చేస్తే ఏదైనా సాధించగలరనే నమ్మకం ఉంది.పార్వతీపురం, డిసెంబరు 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసేందుకు వచ్చే ఏడాది విద్యార్థి ఆవిష్కర్తల భాగస్వామ్య సదస్సు (స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్ట్‌నర్‌షిప్ సమిట్–ఎస్ఐపీఎస్)ను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీనికి పారిశ్రామికవేత్తలను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. పిల్లల ఆలోచనలు బాగుంటే వారి ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం(పీటీఎం)లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆయన, విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. పిల్లల విద్యా ప్రమాణాలను సీఎం పరిశీలించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కష్టపడి చదివి.. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవడంతో పాటు వారి ఇష్టాలను గౌరవించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రమాణాల స్థాయి పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను లోకేశ్ సీఎంకు వివరించారు.

ఛానల్ ఫాలో అవ్వండిఅనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. ఉన్నత విద్య కోసం, విదేశీ విద్య కోసం ‘కలలకు రెక్కలు’ పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. విదేశీ విద్యకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పిస్తాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థుల కలలు, కోరికలను చంపుకోవాల్సిన అవసరం లేదు. వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. పిల్లలకు అవసరమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి. రాబోయే కాలంలో విద్యావ్యవస్థలో ఎవ్వరూ ఊహించని విధంగా ఫలితాలు వస్తాయి. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి’ అని పిలుపిచ్చారు. గిరిజన ప్రాంతానికి చెందిన అంధ విద్యార్థిని కరుణకుమారి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని అంధ మహిళా క్రికెట్ ప్రపంచకప్‌ను సాధించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆడబిడ్డలను వేధించిన వారికి అదే చివరి రోజవుతుందని హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని చెప్పారు. ఆయన ఇంకా మాట్లాడారంటే.. ఇప్పుడు పిల్లలే ఆస్తి..ఒకప్పుడు పిల్లలను తల్లిదండ్రులు భారంగా భావించేవారు. కానీ నేడు ఆ పిల్లలే ఆస్తి. పిల్లలే తల్లిదండ్రులకు శ్రీరామరక్షగా నిలుస్తున్నారు. తల్లిదండ్రు లు పిల్లల కోసం కష్టపడతారు. గురువులు విద్యను బోధించడంతో పాటు పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. విలువలతో కూడిన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో.. సహకరించాలని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును కోరాం. ప్రపంచంలో లెర్నింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 18 మంది విద్యార్థులకో ఉపాధ్యాయుడు ఉన్నారు. అదే ప్రైవేటు పాఠశాలల్లో 28మంది విద్యార్థులకు ఒకరే టీచర్’” అని తెలిపారు.టీచర్లను గౌరవిస్తాం.. ఉపాధ్యాయులను గౌరవించే బాధ్యత మాది. పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తాం. తద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష కూడా నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వం 45 యాప్‌లు పెట్టింది. టీచర్లకు 24 గంటలూ అదే పని. మేమిప్పుడు ఒకే యాప్ తెచ్చాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా చేశాం.లోకేశ్ కోసం ఎప్పుడూ స్కూలుకెళ్లలేదు.. లోకేశ్ కోసం నేనెప్పుడూ స్కూలుకు వెళ్లలేదు. నా భార్య వెళ్లేది. అన్నీ ఆవిడే చూసుకునేది. లోకేశ్‌ను రాజకీయాల్లోకి రమ్మని నేనెప్పుడూ బలవంతం చేయలేదు. మంత్రి పదవి ఇచ్చేటప్పుడు కూడా ఏశాఖ కావాలని అడిగితే ఎడ్యుకేషన్ అడిగారు. ఆ శాఖ చాలా కష్టంగా ఉంటుందన్నాను. అయితే తాను ఇష్టపడుతున్నానని, ఆ శాఖ తీసుకుని చరిత్ర సృష్టిస్తానని లోకేశ్ చెప్పారు.. ఆశీర్వదించాను. లోకేశ్‌కు ఒకటే చెబుతున్నా. నీ తల్లి నిన్ను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వరకు తీసుకెళ్లింది. ఇప్పుడీ పిల్లలను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది. మూడేళ్లలో దేశంలోనే ఏపీ విద్యావ్యవస్థ నంబర్ వన్ స్థానంలో ఉంటుందని లోకేశ్ నాకు హామీ ఇచ్చారు. అన్ని దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. భవిష్యత్‌లో భారత్ పిల్లలు, యువశక్తి ఎక్కువ ఉండే దేశం అవుతుంది. ఇప్పుడే వారి నాలెడ్జ్ చూశాను. వారి వద్ద నేనే నేర్చుకునే రోజు వస్తుందని అనుకుంటున్నా. పిల్లలను తీర్చిదిద్దితే ప్రపంచాన్నే సాధిస్తారు.

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి: సీఎం చంద్రబాబు

వినూత్న కార్యక్రమాలకు విద్యార్థులు ఎప్పుడూ ముందుండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. చదువుతో పాటు ఆట, పాటలు కూడా ఉండాలన్నారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో జనాభా తగ్గిపోతున్న పరిస్థితి ఉందని, భవిష్యత్తులో పిల్లలు ఎక్కువగా ఉండే దేశం మనదే అవుతుందన్నారు. పిల్లల బలాలు, బలహీనతలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలని సూచించారు.

# వెనక్కితగ్గమంటున్నరైతులు

**దక్షిణాదిలో ఇప్పటికే 40,500 హెక్టార్లలో సాగు**
**ఇంకా అంతకుపైనే అవకాశం**
**బోర్డు అధికారుల సూచనలు బేఖాతర్**
**ప్రస్తుత మార్కెట్లో ధరలు తగ్గినా సాగువైపే మొగ్గు**
**శనగ ఆశాజనకంగా లేకపోవడం, వాతావరణ సానుకూలతలే కారణం**
**ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా నాట్లు, విడుపులు**




**నమస్తే హైదరాబాద్ :** ఒంగోలు, డిసెంబరు 5 దక్షిణాదిలో ఈసారీ పొగాకు సాగు పెరుగుతోంది. గడిచిన సీజన్ మార్కెట్ ఒడిదొడుకుల్లో నడిచినా రైతులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మూడేళ్ల క్రితం పంట ఉత్పత్తి కొంత అదుపులో ఉండగా 2022-23 నుంచి 2024-25 వరకు మూడేళ్లలో భారీగా పెరిగింది. ప్రత్యేకించి 2024-25 సీజన్‌లో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో సాగైంది. దక్షిణాది ప్రాంతంగా పిలిచే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. 2022-23 సీజన్‌కు ఈ ప్రాంతంలో సుమారు 87.97 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అను మతివ్వగా 123.11 మిలియన్ కిలోల విక్రయాలు జరిగాయి. సగటున కిలోకు రూ.216.28 ధర లభించింది. అదే 2023-24 సీజన్‌కు 88.68 మిలియన్ కిలోల ఉత్ప త్తికి అనుమతిస్తే ఇంచుమించు 154.11 మిలియన్ కిలోలు పండింది. అయినా మా ర్కెట్ బాగా ఉండటంతో మంచి ధరలు లభించి సగటున కిలోకు రూ.265 దక్కింది. ముందు సీజన్‌లో మంచి రాబడులు రావడంతోపాటు 2024-25కు వాతావరణం అనుకూలంగా ఉండటంతో భారీగా సాగు చేశారు. బోర్డు ఆ సీజన్‌కు 104.60 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతిస్తే దాదాపు 88వేల హెక్టార్లలో పంటను సాగు చేసి ఇంచుమించు 157 మిలియన్ కిలోలు పండించారు. పొగాకు బోర్డు లెక్కల ప్రకారం పాతిక వేల హెక్టార్లలో అదనంగా సాగు చేసి సుమారు 53 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి చేశారు. మొత్తం 11 వేలం కేంద్రాల్లో ఒక్క కొండపి మినహా మిగిలిన పది కేంద్రాల్లో వేలం పూర్తయింది. అక్కడ మరో నాలుగు రోజుల్లో ముగియనుండగా దాదాపు 156.30 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.223.14 ధర లభించింది. అంటే అధికంగా పంట సాగు, ఉత్పత్తి పెరిగిన ప్రభావం ధరలపై పడి 2023-24 సీజన్ కన్నా 2024-25 సీజన్ ధరలు గణనీయంగా తగ్గాయి. అలా తగ్గడం వల్ల దక్షిణాది రైతులు గతం కన్నా దాదాపు రూ.500 కోట్ల మేర రాబడిని కోల్పోయి ఆమేర నష్టపోయారు. అంతేకాక గతంలో ఎన్నడూలేని విధంగా వేలం ప్రక్రియ దాదాపు నెలల పాటు సుదీర్ఘంగా సాగింది. వేలం ప్రక్రియ సాగే క్రమంలోనూ మార్కెట్ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది.

నియంత్రణ చర్యలు చేపట్టినా సరే..

రాబోయే సీజన్ (2025-26)లో పరిస్థితి మరింత దారుణంగా ఉండే సంకేతాలు ప్రస్తుత కొనుగోళ్ల సీజన్‌లోనే కనిపించాయి. ఈ విషయాన్ని గుర్తించిన పొగాకు బోర్డు 2025-26 సీజన్‌కు సాగు నియంత్రణపై తొలి నుంచే దృష్టి సారించింది. తొలుత పంట ఉత్పత్తి లక్ష్యాన్ని తగ్గించింది. దక్షిణాదిలో 2024-25 సీజన్‌కు 104 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చిన పొగాకు బోర్డు 2024-26 సీజన్‌కు 90 మిలియన్ కిలోలకు తగ్గించింది. గతానికి భిన్నంగా ఈసారి నారుమడులు పెట్టే సమయం నుంచే నియంత్రణ చర్యలు చేపట్టింది. పొగాకు బోర్డు నుంచి అనుమతి పొంది సీటీఆర్ఐ నుంచి విత్తనాలు పొందిన వారే నారుమడులు పెట్టాలని షరతు విధించింది. అంతేకాకుండా అధికారులు తనిఖీలు చేసి నియంత్రించారు. అలాగే అధిక పంట సాగు వల్ల జరిగే అనర్థాలు, 2024-25 సీజన్ మార్కెట్ సంక్షోభానికి కారణాలు, రానున్న సీజన్‌లో ప్రతికూల పరిస్థితులు, అంతర్జాతీయంగా పెరిగిన పంట ఉత్పత్తిపై విస్తృతంగా రైతులలో ప్రచారం చేపట్టారు. ఇందుకోసం వేలం కేంద్రాల స్థాయిలో అలాగే అధికంగా పంట పండే గ్రామాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించారు. బ్యారన్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని కొంత కఠినతరం చేశారు. అయినా ప్రస్తుతం దక్షిణాదిలో పొగాకు పంట సాగు భారీగానే కనిపిస్తోంది. భారీగానే పంట సాగుగత సీజన్ ప్రతికూల మార్కెట్ పరిస్థితులతో నష్టాలు వచ్చినా, బోర్డు అధికా రులు హెచ్చరిస్తున్నా, పెట్టుబడులు భారీగా ఆయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నా చాలాగ్రామాల్లో రైతులు పంట సాగును భారీగానే చేపడుతున్నారు. రెండు నెలల క్రితం వరకు కాస్తంత వెనుకడుగులోనే ఉన్నట్లు కనిపించిన రైతులు తర్వాత మళ్లీ గత రెండేళ్ల వలే సాగుకు ఉపక్రమించారు. ప్రత్యామ్నాయంగా సాగు చేసే శనగ పంట పరిస్థితి బాగా లేకపోవడం, వాతావరణం పొగాకు సాగుకు అనుకూలంగా ఉండటం, అక్టోబరులో ఒక్కసారిగా పొగాకు గరిష్ఠ ధరలు కిలో రూ.350 దాటడం వంటివి తిరిగి రైతులను సాగుకు ప్రేరేపిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది తేలిక నేలల రీజియన్‌లో 27,139 హెక్టార్లు, నల్లరేగడి రీజియన్‌లో 13,367 హెక్టార్లు కలిపి 40,507 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు.జోరుగా నాట్లు గత అక్టోబరులో సంభవించిన మొంథా తుఫాన్ ఒకరకంగా పంట సాగు సీజన్‌ను తలకిందులు చేసింది. అప్పటికే వేసిన పంట దెబ్బతినగా, తదుపరి సాగు ఆలస్యమైంది. అయినా 40వేల హెక్టార్లకుపైగా సాగు కాగా తుఫాన్ తీవ్రత, తాజా వర్షాల వాతావరణం నుంచి తేరుకొని ప్రస్తుతం తిరిగి రైతులు నాట్లను జోరుగా వేస్తున్నారు. పొగాకు అధికంగా పండే కొండపి, కందుకూరు, ఎస్ఎన్‌పాడు, మార్కాపురం, కనిగిరి, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఏ గ్రామంలో చూసినా పొగనాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఈ సీజన్‌లో కూడా 80 నుంచి 90వేల హెక్టార్లలో పంట సాగు జరిగి ఆమేర ఉత్పత్తి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిపై పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు స్పందిస్తూ అధిక సాగు అనర్థం అన్నారు. బోర్డు అధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు. ధర లేక, అమ్ముడుపోక 2024-25లో తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చిన వాస్తవ పరిస్థితిని గుర్తించి సాగు తగ్గించాలని రైతులకు సూచించారు. లేకపోతే నష్టపోతారన్నారు.

# అదరహో.. మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్..

**విద్యార్థినులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్..**
**విద్యార్థుల సమగ్ర వికాసమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.**
**హైస్కూలు అభివృద్ధికి తగు చర్యలు..**







**నమస్తే హైదరాబాద్ :** విద్యార్థిని, విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు.

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాలికోన్నత పాఠశాలలలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పిల్లల ప్రగతి నివేదికలపై ముఖాముఖీగా చర్చించారు. విద్యార్థినుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. పరీక్షలలో సాధించిన మార్కులు, పురోగతిని పరిశీలించారు. విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేథో సామర్థ్యాల నవోదు పరిశీలించారు. ఎగ్జిబిషన్లు, తరగతి గదులను సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సర్కారు పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. విద్యార్థులలో లోపాలను సరిదిద్ది అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చి దిద్దడానికి ఈ సమావేశాలు ఉపకరిస్తాయన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగవుతాయన్నారు. విద్యా విషయాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరిగి విద్యార్థి వికాసానికి దోహదపడుతుందన్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను మరింత ఉన్నతంగా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి మించి సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు.

ఎక్కడున్నా మంచిని గ్రహించాలి:

ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని ప్రభుత్వం విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తల్లికి వందనం కింద పిల్లలందరికీ రూ.15వేలు చొప్పున అందించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారు చెప్పిన విధంగా కలలు కని వాటిని సాకారం చేసుకోవడానికి కష్టపడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, కార్యదీక్ష, ఓర్పు, సమయస్ఫూర్తి, నైతిక విలువలు, సంస్కారం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ నిశిత పరిశీలన, సమగ్ర అధ్యయనం అవశ్యమన్నారు. పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటివద్ద కూడా పిల్లలకు మంచి వాతావరణం కల్పించాలని అన్నారు. టీవీలు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఎక్కడున్నా మంచిని గ్రహించాలని విద్యార్థులకు ఉద్బోధించారు.

విద్యార్థినులకు వరాల జల్లు, హైస్కూలు అభివృద్ధికి చర్యలు:

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పాఠశాలలోని విద్యార్థినులకు వరాల జల్లు కురిపించారు. ఆట వస్తువులు, క్రీడా సామాగ్రి కొనుగోలులు తన స్వంత నిధుల నుంచి రూ.2లక్షలకు పైగా వెచ్చించనున్నట్లు ప్రకటించారు. మైలవరంకు చెందిన హారిక అనే క్రికెట్ క్రీడాకారిణికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని తక్షణమే అందజేశారు. అలాగే ఈ పాఠశాలలో చదివే అన్ని తరగతుల విద్యార్థినులకు మొదట స్థానాలలో నిలిచి ప్రతిభ చూపిన వారికి రూ.1 లక్ష ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని ప్రకటించిన.పాఠశాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులను, నాయకురాళ్లను భాగస్వామ్యం చేస్తూ కమిటీని నియమించారు. మండల పరిషత్తు నుంచి రూ.7.5 లక్షలు, కొండపల్లి మున్సిపాలిటీ నుంచి రూ.7.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఏ.పి.హెచ్.ఎం.ఈ.ఎల్ నుంచి రూ.8 లక్షలు సి.ఎస్.ఆర్ నిధులు కేటాయిస్తానని వెల్లడించారు. ఈ మొత్తం నిధులతో హైస్కూలులో వంట గది, డైనింగ్ హాల్, పెయింటింగ్, టాయిలెట్స్ ఆధునికీకరణ, పలు ప్రధాన సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. పాఠశాల వద్ద బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనితో విద్యార్థినుల తల్లిదండ్రులు, పిల్లలు హర్షధ్వానాలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# కులం ప్రాంతం పేరుతో విడిపోతే హిందూ ధర్మానికి నష్టమని వెల్లడి



భారతదేశంలో హిందువులు తమ మత విశ్వాసాలను ఆచరించేందుకు న్యాయపోరాటాలు చేయాల్సి రావడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని తిరుప్పరన్‌కుంద్రం కొండపై కార్తీక దీపం వెలిగించే విషయంలో కోర్టు అనుమతి ఉన్నప్పటికీ, అధికారులు అడ్డుకోవడంపై ఆయన స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల వ్యవహారాలను భక్తులే పర్యవేక్షించేలా "సనాతన ధర్మ రక్షా బోర్డు"ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు."తిరుప్పరన్‌కుంద్రం, ఆరు సుబ్రహ్మణ్య క్షేత్రాలలో మొదటిది. అక్కడ కార్తీక మాసంలో కొండపై దీపాలు వెలిగించడం హిందువుల ప్రాచీన సంప్రదాయం. ఈ రోజు భారతదేశంలో హిందువులు తమ విశ్వాసాలను ఆచరించడానికి, సంప్రదాయాలను పాటించడానికి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి రావడం బాధాకరం, విచారకరం. ఒక నిర్ణయాత్మకమైన న్యాయపోరాటంలో గెలిచిన తర్వాత కూడా, భక్తులు తమ సొంత ఆస్తిపై ఒక చిన్న, శాంతియుతమైన ఆచారాన్ని కూడా పాటించలేకపోతే, ఇక ఈ దేశంలో వారికి రాజ్యాంగబద్ధమైన న్యాయం ఎక్కడ లభిస్తుందిభారతదేశంలోని హిందువులందరూ ఒక కఠోర నిజాన్ని అర్థం చేసుకోవాలి. దీపం వెలిగించే హక్కు మనకే ఉందని చెన్నై హైకోర్టు మొదట సింగిల్ జడ్జి ద్వారా, ఆ తర్వాత ఉన్నత ధర్మాసనం ద్వారా ధృవీకరించింది. చట్టపరంగా మనం గెలిచాం. కానీ ఆచరణలో మాత్రం సర్దుకుపోవాల్సి వచ్చింది.మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ఏ మతపరమైన పండుగనైనా ఒక వారం ఆలస్యంగా జరుపుకోగలరా ఒక పవిత్రమైన రోజు వేడుకను వేరే సమయానికి మార్చగలరా లేదు. ఎందుకంటే మతపరమైన సమయం, క్యాలెండర్ల పవిత్రత చర్చించలేనివి.అయినా సనాతన ధర్మానికి సంబంధించిన ఆ పవిత్రమైన కార్తీక దీపపు క్షణం దొంగిలించబడింది. అది శాశ్వతంగా మాయమైపోయింది. ఎందుకంటే హిందువులను చులకనగా తీసుకుంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు, ఎన్జీవోలు, మేధావులమని చెప్పుకునే బృందాలు ఇలా ఎవరైనా సరే, నష్టాన్ని అంగీకరించి సర్దుకుపోయేది మాత్రం ప్రతిసారీ హిందువులే. మనం హక్కును సాధించుకున్నాం, కానీ ఆచారాన్ని కోల్పోయాం. ఈ పునరావృత, వ్యవస్థాగత తిరస్కరణ కారణంగా, కేవలం కోర్టు విజయాలు మాత్రమే కాకుండా అంతకుమించి డిమాండ్ చేయాల్సిన సమయం వచ్చింది. భక్తులే తమ దేవాలయాలు, మతపరమైన వ్యవహారాలను చురుకుగా నిర్వహించే 'సనాతన ధర్మ రక్షా బోర్డు' మనకు అవసరం.హిందూ సంప్రదాయాలను, ఆచారాలను అపహాస్యం చేయడం కొన్ని సమూహాలకు పరిపాటిగా మారింది. ఇతర మతాల కార్యక్రమాల విషయంలో వారు అదే ధైర్యం చేయగలరా.హిందువులకు ఆర్టికల్ 25 ప్రాథమిక హక్కు కాకుండా, ఐచ్ఛిక హక్కుగా మారిందా ఒక పోలీస్ కమిషనర్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ నిర్దిష్ట హైకోర్టు ఆదేశాలను ఏకపక్షంగా రద్దు చేయగలరా చట్టబద్ధమైన భూమిలో దీపం వెలిగించడం 'హానిచేయని మతపరమైన చర్య' అని హైకోర్టు నిర్ధారించినప్పుడు, ఈ ఆచారం మత సామరస్యానికి ముప్పు అని ఎవరు, ఏ చట్టపరమైన యంత్రాంగం ద్వారా నిర్ణయిస్తారు? హిందూ మత సంస్థల శాఖ అధికారులు నిలకడగా హిందూ భక్తుల ప్రయోజనాలకు, ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? వారెలా జవాబుదారీతనం నుంచి తప్పించుకుం టున్నారుమతపరమైన సమస్యలు తలెత్తినప్పుడు అబ్రహామిక్ మతాలను అనుసరించేవారిలో ఉన్న ఐక్యతా స్ఫూర్తిని, సంఘీభావాన్ని హిందువులు గమనించాలి. వారు తమ విశ్వాసం కోసం జాతి, ప్రాంతీయ, భాషా భేదాలను అధిగమిస్తారు.హిందువులు కులం, ప్రాంతం, భాషా అడ్డంకులతో విడిపోయి ఉన్నంత కాలం, హిందూ మతం, దాని ఆచారాలపై అపహాస్యాలు, అవమానాలు కొనసాగుతూనే ఉంటాయి. మన దేశంలోని హిందువులు హిందూ ధర్మం స్ఫూర్తితో ఒక ఉమ్మడి కనీస కార్యక్రమం కింద ఏకం కాకపోతే, ఈ స్ఫూర్తి నశించిపోతుంది.కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుంచి ద్వారక వరకు ఉన్న ప్రతి హిందువు తమ సొంత గడ్డపై హిందువులు ఎదుర్కొంటున్న అవమానాలపై మేల్కొనే రోజు వస్తుందని నేను ఆశిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు బిగ్ అలర్ట్.. వారితో జాగ్రత్త

**నమస్తే హైదరాబాద్ :** ఎమ్మెల్యే ఎమ్మెల్సీల నకిలీ సిఫారసు లేఖలతో శ్రీవారి దర్శనం చేయిస్తామని భక్తులను మోసగిస్తున్న ఇద్దరి దళారీలను అరెస్ట్ చేశారు తిరుపతి పోలీసులు. వీరిద్దరూ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తోపాటు ప్రజాప్రతినిధుల పేరుతో నకిలీ లేఖలను తయారు చేసి భక్తులను బురిడీ కొట్టిస్తున్నట్లు గుర్తించారు. వీళ్లు నాయుడుపేటకు చెందిన బల్లి ప్రవీణ్ కుమార్, చెంచు బాలాజీలుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ గత కొంతకాలంగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరు సూళ్లూరు పేట టిడిపి ఎమ్మెల్యే విజయశ్రీ, గూడూరు టిడిపి ఎమ్మెల్యే పాశంసునీల్ కుమార్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి పేర్లను దుర్వినియోగం చేస్తూ ఫేక్ లెటర్స్ ను తయారు చేశారు. దీంతో నిందితుల నుంచి ఫేక్ లెటర్స్ తో పాటు, బ్యాంక్ పాస్ బుక్స్, నగదు స్వాధీనం చేసుకున్నారు. టిటిడి విజిలెన్స్ నిఘాలో వెలుగు చూసిన ఈ వ్యవహారంపై గూడూరు వన్ టౌన్, తిరుమల టూ టౌన్ పీఎస్ లో కేసులు నమోదు అయ్యాయి.

మోసాలపై పోలీసుల ప్రకటన తిరుమల శ్రీవారి దర్శనం కోసం దళారీలను నమ్మవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీవారి సేవా టికెట్లు టిటిడి అధికారిక వెబ్‌సైట్ లేదంటే కౌంటర్లలో మాత్రమే అందుబాటులో ఉంటాయని.. ఎవరైన దర్శనాల పేరుతో డబ్బులు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# విశాఖలో సరికొత్త థ్రిల్.. రూ.90 కోట్లతో వర్చువల్ రియాల్టీ ఎరీనా

**నమస్తే హైదరాబాద్ :** విశాఖపట్నానికి గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ సహా ఐటీ కంపెనీలు క్యూ కట్టాయి. త్వరలోనే మరికొన్ని కంపెనీలు కూడా రాబోతున్నాయి. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు మాత్రమే కాదు.. నగరంలో పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేసే పనిలో ఉంది ప్రభుత్వం.. ప్రణాళికల్ని కూడా సిద్ధం చేస్తోంది. విశాఖపట్నంలో వర్చువల్ గేమింగ్ కోసం ఒక ప్రత్యేక పార్క్ రానుంది. వీఎంఆర్‌డీఏ (విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ) రుషికొండలో ప్రత్యేక పార్క్‌ను.. 2.82 ఎకరాల్లో రూ.90 కోట్లతో ఈ ప్రాజెక్టును పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) కింద నిర్మించనుంది. ఈ పార్క్‌లో వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా, 3 స్టార్ హోటల్ కూడా ఉంటాయి. ఈ విషయాన్ని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్ తెలిపారు.

ఈ కొత్త పార్క్‌లో ఎన్నో ఆకర్షణలు ఉండనున్నాయి. వర్చువల్ ఎక్స్‌పీరియన్స్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూం, లేజర్ షోలు, 360 డిగ్రీల ఇమ్మర్సివ్ థియేటర్, వర్చువల్ టైం ట్రావెల్, వీఆర్ గేమింగ్ జోన్, డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్ వంటివి ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా, ఇక్కడ కేఫ్‌లు, ఫుడ్ కోర్టులు కూడా అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికపై కసరత్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. వర్చువల్ రియాల్టీ అంటే కంప్యూటర్ ద్వారా సృష్టించిన ఒక కృత్రిమ ప్రపంచంలో మనం ఉన్నట్లుగా అనుభూతి చెందడం. 360 డిగ్రీల ఇమ్మర్సివ్ థియేటర్ అంటే తెరపై కనిపించే దృశ్యాలు మన చుట్టూ ఉన్నట్లుగా అనిపించడం. మిక్స్‌డ్ రియాల్టీ అంటే నిజ ప్రపంచంలోకి వర్చువల్ అంశాలను జోడించడం.

విశాఖలో గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం.. టికెట్ల వివరాలివే

విశాఖపట్నం కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభించిన సంగతి తెలిసిందే. దేశంలోనే అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జిగా రూ.7 కోట్లతో వీఎంఆర్డీఏ నిర్మాణం చేశారు. ఈ బ్రిడ్జిని




సందర్శించడానికి జనాలు తరలివస్తున్నారు.. పర్యాటకులతో పాటుగా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన వారు ఎక్కువమంది వస్తున్నారు. గ్లాస్ బ్రిడ్జిపై నుంచి సముద్రాన్ని చూస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతున్నారు.. అక్కడ సందడి వాతావరణం కనిపిస్తోంది. ఛార్జీల విషయానికి వస్తే.. ఒకరికి రూ.250 కాగా, భార్యాభర్తలు ఒక కిడ్‌కు రూ.650గా నిర్ణయించారు. ఇందులో ఫ్యామిలీ కాంబో కింద భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలకు కలిపి రూ.800 ఫిక్స్ చేశారు. ఎవరైనా గ్రూప్‌గా వచ్చి 10మందికిపైగా ఉంటే ఒక్కో టికెట్ రూ.200గా నిర్ణయించారు. అంతేకాదు ఇందులో ఫ్రెండ్స్ కాంబో కింద ఐదుగురు ఉంటే ఒక్కో టికెట్ ధర రూ. 220గా నిర్ణయించారు. ఒక్కొక్కరు గ్లాస్ బ్రిడ్జిపై పదినిమిషాల పాటూ ఉండొచ్చు.. 40మంది చొప్పున బ్రిడ్జి పైకి పంపిస్తున్నారు.

# వైఎస్ జగన్ వీలైతే ఆ పని చెయ్.. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి



**నమస్తే హైదరాబాద్ :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి.. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓ సలహా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సు కోసం పలువురు రాజకీయ ప్రముఖులను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులను గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించారు.

అమరావతిలోని సీఎం చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎంతో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా చంద్రబాబును కోమటిరెడ్డి ఆహ్వానించారు.దావోస్ సదస్సు తరహాలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహిస్తున్నట్లు చంద్రబాబుకు వివరించారు. ఈ సదస్సుకు ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రముఖ సంస్థల ప్రతినిధులు, నిపుణులు హాజరవుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పలు అంశాలపై స్పందించారు. చంద్రబాబు నాయుడు విజన్ 2020 కి హైదరాబాద్ ప్రతిరూపమని కొనియాడారు. ఏపీ రాజధాని అమరావతి కూడా ఫ్యూచరిస్టిక్ కేపిటల్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సలహా ఇచ్చారు. వైఎస్ జగన్‌కు వీలైతే అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు. ప్రజాసమస్యలను లేవనెత్తడానికి శాసనసభకు మించిన వేదిక లేదని సూచించారు. ఏ రాష్ట్రంలో అయినా సీఎం తర్వాత.. విపక్ష నేతకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుందన్న కోమటిరెడ్డి.. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ పోరాటాన్ని గుర్తు చేశారు. అప్పట్లో తాము ఆరుగురు ఎమ్మెల్యేలమే అయినప్పటికీ.. అసెంబ్లీకి వెళ్లి బీఆర్ఎస్ మీద పోరాడామని గుర్తు చేశారు. వైఎస్ జగన్ కూడా అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు.

మరోవైపు పవన్ కళ్యాణ్ మీద ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందించారు. పవన్ కళ్యాణ్ దిష్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన కోమటిరెడ్డి.. పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పకపోతే సినిమాలను ఆడనివ్వబోమంటూ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ తర్వాతి పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపట్ల వివరణ ఇచ్చింది. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని కోరింది. దీంతో ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడగా.. తాజాగా పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి వివరణ ఇచ్చారు. అప్పటి పరిస్థితుల కారణంగా అలా మాట్లాడాల్సి వచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలు కలిసి ఉండాలని.. ప్రజల మధ్య స్నేహం కొనసాగాలనేది తమ అభిలాష అని వెల్లడించారు.

# జిల్లాలోని 594 ప్రభ్వు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు సందడిగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ 585 ప్రభుత్వ, జడ్పీ, జీవీఎంసీ పాఠశాలలు, బీసీ/ఎస్సీ/ఎస్టీ రెసిడెన్సియల్ పాఠశాలలు, కేజీబీవీలు, తొమ్మిది జూనియర్ కళాశాలల్లో విద్యా శాఖ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. బాల్య వివాహాలు నిర్మూలన, ఇతర విద్యా సంబం?ధ అంశాలపై చర్చించారు. అనంతరం తల్లిదండ్రుల నుంచి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులు అక్కయ్యపాలెం ఎన్జీజీవో కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నడుపూరు ఉన్నత పాఠశాలలో, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆనందపురం కేజీబీవీ, భీమిలి జూనియర్ కళాశాల, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శ్రీహరిపురం, ఆర్ఆర్‌పేటలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పెందుర్తి ఉన్నత పాఠశాల, దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణశ్రీనివాస్ ప్రకాశరావుపేట, డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్, టీచర్ సమావేశాలకు హాజరయ్యారు. జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా ఏపీసీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.




ఎకనామిక్ రీజియన్లో ఇరవై లక్షల ఉద్యోగాలు

అందుకు అనుగుణంగా కీలక రంగాలను అభివృద్ధి చేయాలి

విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) సీఈఓ యువరాజ్

మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చాలనేది లక్ష్యం

విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)లో 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కీలక రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉందని పరిశ్రమల శాఖ సెక్రటరీ, వీఈఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) యువరాజ్ అన్నారు. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ఈ ప్రాంత ఐఏఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీతి ఆయోగ్ సూచనల మేరకు 21,880 చ.కి.మీ. విస్తీర్ణంలో వీఈఆర్ ప్రాజెక్టును ప్రతిపాదించారన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అభివృద్ధి ధ్యేయంగా ఇది ఏర్పాటైందన్నారు. దీనిని 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చాలనేది సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన లక్ష్యంగా పేర్కొన్నారు. దీనిని సాధించడానికి పోర్టుల ద్వారా వ్యాపార అవకాశాలు విస్తృతం చేయడం, ఐటీ హబ్‌లు, ఇన్నోవేషన్ కేంద్రాల అభివృద్ధి, వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలను బలోపేతం చేయడం, పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహించడం, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను పెంపొందించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రైల్వే, రోడ్లు, పోర్టులను అభివృద్ధి చేయడం వంటివి ప్రణాళికలో పొందుపరిచామన్నారు. విశాఖపట్నం ప్రస్తుతం ప్రధానంగా పోర్టులు, భారీ పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, సముద్ర ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా బలోపేతంగా ఉందన్నారు. మిగిలిన రంగాలను కూడా సీఎం చంద్రబాబు ఆదేశం మేరకు ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ ప్రతినిధి ఎస్.కిశోర్, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళీకృష్ణ, సీయూపీ శిల్ప, ఈఈలు భవానీశంకర్, మధుసూదనరావు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో ఏటా డీఎస్సీ... పార్వతీపురం పర్యటనలో చంద్రబాబు



**నమస్తే హైదరాబాద్ :** రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్త వినిపించారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు .. ఆ మాట ప్రకారం ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించిన చంద్రబాబు.. 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. తాజాగా డీఎస్సీపై మరో కీలక ప్రకటన చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సీఎం చంద్రబాబు శుక్రవారం రోజు పర్యటించిన సంగతి తెలిసిందే. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు గానూ.. మన్యం జిల్లా బామినిలో చంద్రబాబు పర్యటించారు. బామినిలో జరిగిన పీటీఎంలో నారా లోకేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చంద్రబాబు మాట్లాడారు. విద్యార్థులకు ఇచ్చిన లెర్నింగ్ టూల్స్ పరిశీలించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి, వారి తల్లితండ్రులతో ముచ్చటించారు.

అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడిన చంద్రబాబు.. ఇక నుంచి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెలలోనే టెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ఇక విద్యార్థులు వినూత్న కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుండాలని చంద్రబాబు సూచించారు. చదువుతో పాటు ఆటపాటలపైనా దృష్టి పెట్టాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని.. తక్కువ సమయమైనా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో జనాభా క్రమంగా తగ్గుతోందని చంద్రబాబు అన్నారు. రాబోయే రోజుల్లో మనదేశంలోనే పిల్లలు ఎక్కువగా ఉంటారని.. యువ శక్తిని మనం సరిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల బలాలు ఏమిటో.. బలహీనతలు ఏమిటో తల్లిదండ్రులతో పాటుగా ఉపాధ్యాయులు గుర్తించి.. అందులో ప్రోత్సహించాలన్నారు.

మరోవైపు ఏపీ ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తెస్తోందని మంత్రి నారా లోకేష్ వివరించారు. విద్యార్థులలో నైతిక విలువలు పెంచేందుకు చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచనాలు, పుస్తకాలు కూడా అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఇక విద్యార్థుల కోసం క్లిక్కర్ సాంకేతికతను కూడా పాఠశాలల్లో ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ఇంగ్లండ్, ఫిన్లాండ్ వంటి దేశాలలో అత్యుత్తమ విద్యా విధానాలు అమలవుతున్నాయన్న నారా లోకేష్.. ఆ విధానాలను పరిశీలించేందుకు ఏపీ నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులను అక్కడకి పంపుతామని వెల్లడించారు. లీప్ యాప్ ద్వారా పిల్లల చదువులపై విద్యార్థుల తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉంచవచ్చని వెల్లడించారు.

# పవన్‌కు పెద్ద అభిమానిని అన్న ప్రత్తిపాటి పుల్లారావు



**నమస్తే హైదరాబాద్ :** చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనతో ఒక సినిమా కూడా తీయాలని భావించానని మనసులో మాట బయటపెట్టారు. అయితే, అనుకోకుండా రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని పేర్కొన్నారు.పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నేను పవన్ అభిమానిని. ఆయనతో సినిమా తీయాలని అనుకున్నాను, అడిగిన వెంటనే అవకాశం కూడా లభించింది అడిగిన వెంటనే ఒప్పుకున్నారు కానీ ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చేశాను అని తెలిపారు.అనంతరం నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పుల్లారావు స్పష్టం చేశారు. ఐఏఎస్ అధికారి కృష్ణతేజ చిలకలూరిపేటలో ప్రభుత్వానికి కోట్ల రూపాయల విలువైన స్థలాలను విరాళంగా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాల ద్వారా పిల్లల చదువుపై మరింత అవగాహన పెంచుకోవచ్చని ప్రత్తిపాటి సూచించారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు



కల్లూరు అర్బన్ పరిధిలోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాల వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల చేత సంతకాలు సేకరించి, వైయస్సార్సిపి సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# సినిమా



## జక్కన్న ప్లాన్ మామూలుగా లేదుగా..

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం 'వారణాసి' సినిమాతో బిజీగా ఉన్నాడు. దర్శక ధీరుడు తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంకా చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నాడు. అందుకు తగ్గట్టే ఇటీవల ఈ సినిమా టైటిల్ టీజర్ లాంచ్ చేయడానికి గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఓ బిగ్ ఈవెంట్ నిర్వహించాడు. కాగా వారణాసి సినిమాతో మహేష్ బాబు కూడా పాన్ వరల్డ్ హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలని చూస్తున్నాడు. ఈ క్రమంలో మహేష్ బాబు వారణాసి సినిమా ప్రమోషన్స్ కోసం రాజమౌళి ఓ సూపర్ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్' సిరీస్‌లో మూడవ చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' మరికొన్ని రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. డిసెంబర్ 19న ఇండియాతో పాటు వివిధ దేశాల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే అమెరికాలో ఈ చిత్రం ప్రీమియర్స్ పడుతున్నాయి. ఇదిలా ఉంటే ఇప్పుడీ సినిమాకు 'వారణాసి' టీజర్‌ను ఈ చిత్రానికి జత చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 'వారణాసి'ని ప్రమోట్ చేయడానికి రాజమౌళి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇండియాతో పాటు చాలా దేశాల్లో 'అవతార్ 3' థియేటర్లలో వారణాసి సినిమా టీజర్ ప్రదర్శితం కానుందని తెలుస్తోంది.

'అవతార్' సినిమా సిరీస్ కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఈ కారణంగా, రాజమౌళి 'వారణాసి' సినిమాను ప్రమోట్ చేయడానికి ఈ సూపర్ హిట్ మూవీని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన కొన్ని దేశాలలో 'అవతార్ 3' సినిమా ఇంటర్వెల్ సమయంలో మహేష్ బాబు 'వారణాసి' సినిమా టీజర్ ను ప్రదర్శించనున్నారు.

అవతార్ 3ః లేదా 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చిత్రానికి జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించారు. ఇది 'అవతార్' సిరీస్‌లో మూడవ చిత్రం. రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రాన్ని చూసిన జేమ్స్ కామెరూన్, రాజమౌళిపై ప్రశంసలు కురిపించారు. గురించి రూపొందిన డాక్యుమెంటరీలో జేమ్స్ కామెరూన్ కూడా కనిపించి ఆ సినిమా గురించి గొప్పగా మాట్లాడారు. ఈ క్రమంలోనే జేమ్స్ కామెరూన్ తన అవతార్ సినిమా ద్వారా రాజమౌళి చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి అంగీకరించినట్లు తెలుస్తోంది.





## బీట్‌రూట్ ఆకులు తింటే ఇన్ని లాభాలా..?

బీట్‌రూట్ మాదిరిగానే బీట్‌రూట్ ఆకుల్లో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బీట్‌రూట్ ఆకులు తింటే ఫెర్టిలిటీ రేటు పెరుగుతుంది. ఇందులోని ఫోలేట్ శిశువు ఎదుగుదలకు సహాయపడుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో నైట్రేట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్‌ను పెంచుతాయి. రక్తపోటును కంట్రోల్ చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ ఎ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

బీట్ రూట్ ఆకుల్లో విటమిన్ ఎ, సి, బి6తో పాటు ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండొచ్చు. ఎందుకంటే బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ సి కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని పెంచుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో కరిగే ఫైబర్, కరగని ఫైబర్ ఉంటుంది. ఇవి పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే గట్ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. జీర్ణ సమస్యలు రావు.

బీట్‌రూట్ ఆకులు తింటే వయస్సుతో పాటు వచ్చే కంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాదు.. బీట్‌రూట్ ఆకుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపు నిండిన ఫీల్ అందిస్తుంది. ఫలితంగా తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గొచ్చు. బీట్‌రూట్ ఆకుల్లో మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ డి అధిక మోతాదులో లభిస్తుంది. ఇవి ఎముకలను బలంగా, ఆరోగ్యవంతంగా మార్చుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో ఉండే విటమిన్ బి6 మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బీట్‌రూట్ ఆకులు తింటే మెదడు పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



## బెల్లం ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది..?

బెల్లం కేవలం తీపి కోసం వాడే పదార్థం మాత్రమే కాదు.. ఇది నిజానికి ఒక సూపర్ ఫుడ్ లాంటిది. ఇందులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ప్రోటీన్, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. సహజ తీపి కలిగి ఉండటం వల్ల ఇది ప్రాసెస్ చేసిన చక్కెర కంటే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా చెబుతారు. బెల్లం గురించి చాలా మందిని గందరగోళానికి గురి చేసే ఒక ప్రశ్న.. దీన్ని రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలా? అని.. ఈ విషయం గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం..

బెల్లం నిల్వ చిట్కాలు

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బెల్లం నిల్వ విషయంలో పాటించాల్సిన నియమాలు ఇక్కడ ఉన్నాయి:

సాధారణంగా ఫ్రిజ్‌లో వద్దు: బెల్లాన్ని రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయమని సాధారణంగా సిఫార్సు చేయరు. ఫ్రిజ్‌లో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల బెల్లం నాణ్యత తగ్గి, త్వరగా పాడవుతుంది.అంతేకాక బూజు వచ్చే అవకాశాలు కూడా పెరుగుతాయి.సరైన నిల్వ పద్ధతి: బెల్లం నిల్వ చేయడానికి అత్యంత సరైన మార్గం ఏమిటంటే.. దానిని తేమ నుండి రక్షించడం. దీని కోసం బెల్లాన్ని వంటగదిలో గాలి చొరబడని కంటైనర్‌లో ఉంచండి. గాలి, తేమ లోపలికి రాకుండా ఉండేలా చూసుకోవాలి. అలాగే పొడి, చల్లని ప్రదేశంలో నిల్వ చేయడం ఉత్తమం.

ఎప్పుడు ఫ్రిజ్‌లో పెట్టాలి: వర్షాకాలం లేదా అత్యంత వేడిగా ఉన్నప్పుడు మాత్రమే బెల్లం త్వరగా కరిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో దానిని పూర్తిగా గాలి చొరబడని కంటైనర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు.

ఆయుర్వేదం ప్రకారం బెల్లం ప్రయోజనాలు

ఆయుర్వేద నిపుణురాలు కిరణ్ గుప్తా.. బెల్లం వల్ల అపారమైన ప్రయోజనాలు ఉన్నాయని వివరిస్తున్నారు. అందుకే రాత్రి భోజనం తర్వాత బెల్లం తినాలని ఆమె సిఫార్సు చేస్తారు.

సహజ డిటాక్సిఫైర్: బెల్లం సహజ డిటాక్సిఫైగా పనిచేసి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

జీర్ణ సమస్యలు: ఇది మలబద్ధకం, వాయువు వంటి కడుపు సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

రోగనిరోధక శక్తి: బెల్లం రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది.

కాలేయ శుద్ధి: ఇది కాలేయాన్ని డిటాక్సిఫై చేయడంలో కూడా సహాయపడుతుంది.

మంచి ఆరోగ్యం కోసం, వంటలో చక్కెర స్థానంలో బెల్లాన్ని ఉపయోగించడం, రాత్రి భోజనం తర్వాత కొద్దిగా బెల్లం తినడం ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా నిపుణులు సూచిస్తున్నారు.

## న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో హోప్ సెంచరీ,,

క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్ - వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మొదటి టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యంలో ఉన్నప్పటికీ షై హోప్ అద్భుత శతకం క్రికెట్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. కంటి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నా డగౌట్‌కి పరిమితం కాకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకుని మరీ బ్యాటింగ్ చేయడమే కాకుండా సెంచరీతో రాణించాడు. దాంతో నాలుగో రోజే ఆలౌట్ అవుతుంది అనుకున్న విండీస్ మ్యాచ్‌పై పట్టు సాధించింది.

న్యూజిలాండ్ భారీ స్కోర్ చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్‌కు 531 పరుగుల లక్ష్యం ఎదురైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ 4 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. షై హోప్ 116 పరుగులు, జస్టిన్ గ్రీవ్స్ 55 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. ఈ టెస్టులో విజయం సాధించాలంటే విండీస్‌కు ఆఖరి రోజు 319 పరుగులు కావాల్సి ఉంది. హోప్, గ్రీవ్స్ ఆఖరి రోజు కూడా నిలబడితే మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం ఉంది.

ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న హోప్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సన్ గ్లాసెస్‌తో బ్యాటింగ్ చేశాడు. హోప్‌కి కొన్ని రోజులుగా తీవ్రమైన కంటి ఇన్ఫెక్షన్ ఉండటంతో మ్యాచ్ మొత్తం యాంటీబయాటిక్ డ్రాప్స్ ఉపయోగించాడు. దాంతో ఫీల్డింగ్ కూడా చేయలేకపోయాడు. అయినా మొదటి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో అదరగొట్టాడు. సన్‌గ్లాసెస్‌తో ఆడుతూ కూడా కివీస్ బౌలర్లను ఎదుర్కొని నిలబడటంతో హోప్ డెడికేషన్‌కు క్రికెట్ లోకం సలాం కొట్టింది.

ఈ ఏడాది ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో షై హోప్ రెండో స్థానంలో నిలిచాడు. టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ 39 ఇన్నింగ్స్‌లలో 1732 పరుగులు చేస్తే, షై హోప్ 46 ఇన్నింగ్స్‌లలో 1677 పరుగులు చేశాడు. కివీస్‌పై రెండో ఇన్నింగ్స్‌లో హోప్ అవుట్ కాలేదు కాబట్టి ఆఖరి రోజు మరో 56 పరుగులు చేస్తే ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే ఈ టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు మొదట ఇన్నింగ్స్‌లో 231 పరుగులకు ఆలౌట్ కాగా, విండీస్ 167 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ టామ్ లాథమ్ 145, రచిన్ రవీంద్ర 176 పరుగులు చేయడంతో 466/8 పరుగుల వద్ద కివీస్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో వచ్చిన ఆధిక్యంతో కలిపి న్యూజిలాండ్ మొత్తం 530 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 212/4 పరుగులు చేసింది.



## ఓడితే ఇక అంతే,,,వైజాగ్‌లో భారత్‌కు డూ ఆర్ డై మ్యాచ్

భారత్ - దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ రసవత్తరంగా సాగుతోంది. రాంచీ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించగా, రాయపూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా స్టన్నింగ్ విక్టరీని సొంతం చేసుకుంది. దాంతో వైజాగ్ వేదికగా జరిగే మూడో వన్డే మరింత ఆసక్తిగా మారింది. ఈ మ్యాచ్‌లో ఏ జట్టు గెలిస్తే అది సిరీస్ కైవసం చేసుకోనుంది. దాంతో సిరీస్ డిసైడర్ మ్యాచ్ ఇరు జట్లకు డూ ఆర్ డైగా మారింది.

వైజాగ్ పిచ్‌లో మొదటి రెండు వన్డేల మాదిరిగానే భారీ స్కోర్ నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖలో బ్యాటింగ్‌కు ఎక్కువ అనుకూలంగా ఉండటంతో మళ్లీ 300కు పైగా స్కోర్ నమోదయ్యే ఛాన్స్ ఉంది. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో టాస్ గెలిచిన జట్టుకే ఎక్కువ విజయావకాశాలు రానున్నాయి. ఈ సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లలో టాస్ ఓడిన కేఎల్ రాహుల్, వైజాగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు

వాతావరణంలో తేమ ప్రభావం పక్కనపెడితే టీమిండియా బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ బంతులు వేయలేక ఇబ్బంది పడుతున్నారు. అర్ష్‌దీప్ సింగ్ మినహా మిగతా ఇద్దరు పేసర్లు హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ భారీగా పరుగులు సమర్పించుకుంటున్నారు. దీనికి తోడు టీమిండియా ఫీల్డింగ్ కూడా భారత్ ఓటమికి ఓ కారణంగా కనిపిస్తోంది. టెస్టు సిరీస్ కోల్పోయిన భారత్ వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని చూస్తోంది. ఒకవేళ వన్డే సిరీస్ కూడా ఓడిపోతే భారీ విమర్శలు మూటగట్టుకునే అవకాశం ఉంది. మొదటి రెండు వన్డేల్లో టీమిండియా ఆఖర్లో ఊహించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయింది. భారీ స్కోర్ చేసినా ఇంకొన్ని పరుగులు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. దాంతో రవీంద్ర జడేజాకు ఆఖరి వన్డేలో రెస్ట్ ఇచ్చి తిలక్ వర్మను ప్లేయింగ్ 11లోకి తీసుకురావాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. తిలక్ వర్మ లోయర్ ఆర్డర్ బ్యాటర్ కాకపోయినా, అతని హిట్టింగ్ సామర్థ్యంతో డెత్ ఓవర్లలో పరుగులు రాబట్టే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రసిద్ కృష్ణ బంతితో అంతగా ప్రభావం చూపకపోయినా, అతనికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో మరో అవకాశం ఇవ్వాల్సిందే. యశస్వి జైస్వాల్ కూడా ఫామ్‌లో లేకపోయినా, బ్యాకప్ ఓపెనర్ లేకపోవడంతో అతడే కొనసాగనున్నాడు.

మూడో వన్డేకి భారత జట్టు అంచనా

యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..